



నేడు జిల్లాకు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ రాక

- కూటమి శ్రేణుల్లో సమరోత్సాహం
- రాజంపేట, రైల్వేకోడూరులో బహిరంగసభలు
- భారీగా జనం హాజరయ్యే అవకాశం



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లు ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సాయంత్రం రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. టీడీపీ వర్గాల సమాచారం ప్రకారం.. గురువారం సాయంత్రం 4 గంటలకు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు వేర్వేరు హెలికాప్టర్‌లలో వస్తున్నారు. తొలుత రాజంపేట పట్టణంలో పాతబస్టాండు సర్కిల్‌లో బహిరంగసభ జరుగుతుంది. తర్వాత రైల్వేకోడూరు పట్టణంలోనూ బహిరంగ సభ జరుగుతుంది. ఈ సభల్లోచంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లతో పాటు రాజంపేట పార్లమెంటు స్థానం కూటమి అభ్యర్థి బీజేపీకి చెందిన మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరు కానున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కూటమి నాయకులు, ముఖ్యకార్యకర్తలు ఈ బహిరంగ సభకు హాజరు కానున్నారు. ఈ నాయకుల పర్యటన రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ, జనసేన బీజేపీ కూటమి శ్రేణుల్లో రాబోయే ఎన్నికలకు సమరోత్సాహం నింపనుంది.

జనం బ్రహ్మరథం

గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనపైన ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మహిళలు, వృద్ధులు, గృహిణులు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, కార్మికులు, కూలీలు ఇలా అన్ని వర్గాల ప్రజల్లోనూ రాష్ట్ర ప్రభుత్వంపైన తీవ్ర వ్యతిరేకత ఉంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సభలకు జనం స్వచ్ఛందంగా హాజరవుతున్నారు. ఎక్కడికి వెళ్లినా బ్రహ్మరథం పడుతున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన సభలకు సైతం జనం విపరీతంగా హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో జరగనున్న బహిరంగ సభలకు రాజంపేట పార్లమెంటు వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో జనం హాజరు కావచ్చని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ వైసీపీ నాయకుల అక్రమాలు, దౌర్జన్యాలు, భూకబ్జాలు, దాడులు, అక్రమంగా ఇసుక అమ్ముకోవడం వంటి సంఘటనలు జరిగాయి. ఈ సంఘటనల వల్ల అధికార పార్టీ గ్రాఫ్ రెండు సంవత్సరాలుగా క్రమంగా పడిపోతోంది. ఈ ప్రభావం ప్రస్తుతం కూటమి ప్రకటించిన అభ్యర్థులకు బలంగా మారుతోంది. రాజంపేట నియోజకవర్గంలో అధికార పార్టీ నుంచి పెద్ద సంఖ్యలో క్రియాశీల నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు టీడీపీలో చేరారు. గత నెల రోజుల వ్యవధిలో తెలుగుదేశం పార్టీ బలపడింది. రైల్వేకోడూరులోనూ అధికార పార్టీ నుంచి పలువురు బలమైన నాయకులు టీడీపీలో చేరారు. రాయచోటి నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన పలువురు ముఖ్యనాయకులు టీడీపీలో చేరారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే గెలుపు కోసం విపరీతంగా కష్టపడిన నాయకులు సైతం టీడీపీలో చేరారు. పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలలో సైతం అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు పసుపు కండువా కప్పుకున్నారు. దీంతో రెండు నెలలుగా జిల్లా తెలుగుదేశం పార్టీ బలపడింది. రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించారు. రాజంపేట పార్లమెంటు స్థానాన్ని బీజేపీ తరఫున కిరణ్‌కుమార్‌రెడ్డికి కేటాయించారు. దీంతో జిల్లాలో కూటమి మధ్య ఐకమత్యం పటిష్ఠంగా ఉంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల సభలకు జనం నుంచి విపరీతమైన స్పందన వచ్చే అవకాశం ఉంది. దీనికితోడు ఎన్నికలు మరో 20 రోజులు మాత్రమే ఉన్న నేపథ్యంలో ముఖ్య నాయకుల పర్యటనతో కార్యకర్తలు, నాయకులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయనున్నారు.

వేర్వేరు హెలికాప్టర్లలో రాక

రాజంపేట, రైల్వేకోడూరు ఎన్నికల ప్రచార సభలో పాల్గొనేందుకు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లు వేర్వేరు హెలికాప్టర్లలో వచ్చి రాజంపేట, రైల్వేకోడూరు సభల్లో పాల్గొననున్నారు. గురువారం సాయంత్రం గురువారం సాయంత్రం 3 గంటలకు తిరుపతి నుంచి రాజంపేట హెలిప్యాండ్ ప్రాంగణానికి రెండు హెలికాప్టర్లలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు చేరుకుంటారని టీడీపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, జనసేన నాయకుడు అతికారి కృష్ణ తెలిపారు. 4 గంటలకు రాజంపేట పాత బస్టాండులో నిర్వహించే ఎన్నికల బహిరంగ సభలో వారిరువురు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. రాజంపేట నుంచి 5.45 గంటలకు కోడూరు హెలిప్యాడ్ ప్రాంగణానికి చేరుకుంటారన్నారు. సాయంత్రం 6.30 గంటల నుంచి 7.45 గంటల వరకు కోడూరు ఎన్నికల బహిరంగ సభలో వారిరువురు ప్రసంగిస్తారన్నారు. తిరిగి తిరుపతికి చేరుకుని ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.

హెలిప్యాడ్‌ను పరిశీలించిన ఎస్పీ

రాజంపేట టౌన్, ఏప్రిల్ 24: రాజంపేటకు గురువారం సాయంత్రం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రాక సందర్భంగా గీతాంజలి కళాశాల పక్కన ఏర్పాటు చేసిన రెండు హెలిప్యాడ్‌లను, బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ కృష్ణారావు బుధవారం సాయంత్రం పరిశీలించారు. టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజుతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. హెలిప్యాడ్ వద్ద బాంబ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు చేయించారు. జనసమీకరణ, వాహనాల పార్కింగ్ ఏర్పాటు తదితర అంశాలపై ఎస్పీ జగన్‌మోహన్‌రాజుతో చర్చించారు.



రాజంపేట హెలిప్యాడ్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు, జగన్‌మోహనరాజు

మదనపల్లె సబ్‌జైలు అధికారులకు సూచనలిస్తున్న జైళ్ల శాఖ డీఐజీ రాజేశ్వరరావు



వేసవిలో ఖైదీలకు అసౌకర్యాలు లేకుండా చూడాలి

- జైళ్ల శాఖ డీఐజీ రాజేశ్వరరావు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 24: సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు వేసవిలో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు చేపట్టాలని జైళ్ల శాఖ డీఐజీ రాజేశ్వరరావు సూచించారు. బుధవారం మదనపల్లె స్పెషల్ సబ్ జైలును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైళ్ల శాఖ డీజీపీ సతీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు రాయలసీమలోని జైళ్లను తనిఖీ చేస్తున్నామన్నారు. వేసవిలో ఉష్ణోగ్రత పెరుగుతోందని దీని వలన ఖైదీలకు వడదెబ్బ తగలకుండా గదుల రూఫ్‌పైన కూల్ పెయింటింగ్ చేయించాలన్నారు. కిటికీలకు వట్టివేరు చాపలు కట్టి రోజుకు రెండుసార్లు నీటితో తడపాలన్నారు. సీలింగ్ ఫ్యాన్లు అన్నీ సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. మట్టికుండలో తాగునీరు ఏర్పాటు చేసి, ప్రతిరోజూ ఒక ఓఆర్ఎస్ ప్యాకెట్, రెండు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ఎవరైనా ఖైదీ అనారోగ్యం పాలైతే వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జైళ్లశాఖ అధికారి వేణుగోపాల్‌రెడ్డి, జైలు సూపరింటెండెంట్ రామకృష్ణయాదవ్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ఎస్ఈబీ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ విజయ్ శేఖర్



చీకిలబైలు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 24: విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని జోన్-4 నోడల్ అధికారి, ఎస్ఈబీ స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ డిప్యూటీ కమిషనర్ టి.విజయ్‌శేఖర్ హెచ్చరించారు. బుధవారం మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆయన విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అలాగే పలు అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడ్డ వాహనాలు, సీజ్ చేసిన మద్యం వివరాలను రికార్డులో సక్రమంగా వున్నాయా లేవా అని పరిశీలించారు.

ఎన్నికల సందర్భంగా నాటుసారా, ఎన్‌డీపీఎల్ అక్రమ రవాణాపై నిఘా పెంచాలని సూచించారు. అనంతరం చీకిలబైలు, రామసముద్రం ఎకొత్తూరు చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులు, మద్యం, నగదు రవాణాను గుర్తించి వాటిని విడియో కవరేజ్‌లో సీజ్ చేసి ఎన్నికల అధికారులకు నివేదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరవ రోజు నామినేషన్ల జోరు

- రాజంపేట ఎంపీ స్థానానికి 17 మంది నామినేషన్లు
- ఎంపీకి నల్లారి కిరణ్, రాజంపేట, రాయచోటి, అసెంబ్లీకి సుగవాసి బాలసుబ్రమణ్యం, మండిపల్లి



రాజంపేట, రాయచోటి అసెంబ్లీ స్థానాలకు టీడీపీ తరపున నామినేషన్ వేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 24: జిల్లాలో ఆరవ రోజు నామినేషన్‌ల జోరు కొనసాగింది. రాజంపేట ఎంపీ స్థానానికి భారతీయ జనతా పార్టీ తరపున నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి మూడు సెట్ల నామినేషన్‌లు వేయగా, వైసీపీకి చెందిన పెద్దిరెడ్డి లక్ష్మి దివ్య నామినేషన్ వేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున షేక్ నజీర్ అహ్మద్ ఒక సెట్ నామినేషన్ వేయగా, పి.నరేందర్‌రెడ్డి బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అంతేగాక రాజంపేట ఎంపీ స్థానానికి దాదాపు 13 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్‌లు వేశారు. రాజంపేట అసెంబ్లీ స్థానానికి సుగవాసి సుబ్రమణ్యం 2 సెట్లు నామినేషన్ దాఖలు చేయగా, 8 మంది ఇండిపెండెంట్‌లుగా నామినేషన్‌లు వేశారు. రైల్వేకోడూరు అసెంబ్లీ స్థానానికి వైసీపీ తరపున కొరముట్ల శ్రీనివాసులు, జనసేన పార్టీ తరపున ఇద్దరు నామినేషన్లు వేశారు. 12 మంది ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారు. రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రెండు సెట్లు నామినేషన్‌లు వేయగా, వైసీపీ తరపున శివలలిత ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. షేక్ అల్లాబకష్ కాంగ్రెస్ తరపున ఒక సెట్టు నామినేషన్ వేయగా షహబూలత్‌బాషా ఇండియన్ యూనియన్ ముస్లిం పార్టీ తరపున ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. జిలాన్ బాషా జనసేన పార్టీ తరపున నామినేషన్ వేయగా బి.ఆంజనేయులు బహుజన సమాజ్ తరపున నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా బాలిసేని శ్రీనివాసులరెడ్డి నామినేషన్లు వేశారు. జైభారత్ తరపున విజయ్‌కుమార్ కూడా నామినేషన్ వేశారు. మదనపల్లె వైసీపీ తరపున ఒకరు నామినేషన్, కాంగ్రెస్ తరపున ఒకటి, బీఎస్పీ ఒకరు, ఇండిపెండెంట్లు ఇదరు నామినేషన్ వేశారు. తంబళ్లపల్లె వైసీపీ తరపున ద్వారకనాథరెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, కవిత, ఒక్కొక్క సెట్టు నామినేషన్ వేయగా, తెలుగుదేశం పార్టీ తరపున దాసరపల్లి జయచంద్రారెడ్డి సెట్టు నామినేషన్ వేయగా ఆయన భార్య కల్పన ఒక సెట్టు టీడీపీ తరపున నామినేషన్ వేశారు.



రాజంపేట ఎంపీ స్థానానికి బీజేపీ తరపున నామినేషన్ వేస్తున్న కూటమి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

ఎన్డీఏ కూటమి గెలుపు అభివృద్ధికి మలుపు

- రాయచోటిలో కిరణ్‌కుమార్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలకు ఘనస్వాగతం
- విజయోత్సవ ర్యాలీని తలపించిన నామినేషన్ ర్యాలీ



రాయచోటిటౌన్, ఏప్రిల్ 24: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, రాయచోటి అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిల నామినేషన్ కార్యక్రమం బుధవారం అట్టహాసంగా జరిగింది. అశేష జనవాహిని నడుమ రాజంపేట పార్లమెంట్ స్థానానికి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, రాయచోటి అసెంబ్లీ స్థానానికి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలు నామినేషన్‌లు దాఖలు చేశారు. రాయచోటి పట్టణ పురవీధుల్లో విజయోత్సవ ర్యాలీని తలపించే విధంగా నామినేషన్ ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట పార్లమెంట్ పరిధిలో పలు నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ, చెక్‌పోస్టు శివాలయం నుంచి మదనపల్లె రోడ్డు, కొత్తపేట జగదాంబ సెంటర్, బస్టాండు మీదుగా నేతాజీ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా లంబాడీల నృత్యాలు, కోలాటాలు, డప్పులు, బాణాసంచాలతో రాయచోటి పట్టణం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, దేశంలో నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా గెలిస్తే దేశం, రాష్ట్రం రెండు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఎన్నికలప్పుడే మీ ఇంటికి వచ్చే నాయకుడు కావాలా.. ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటూ మీలో ఒకరిగా ఉండి మీకు సేవ చేసే రాంప్రసాద్‌రెడ్డి కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని అన్నారు. ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలను చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్న వైసీపీ నాయకులకు మే 13వ తేదీ ప్రజలు తమ ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పనున్నారని మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. వైసీపీ అరాచక పాలన నుంచి సామాన్య ప్రజలకు విముక్తిని కలిగింపజేస్తామని మండిపల్లి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, పీలేరు అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, ధర్మవరం జనసేన ఇన్‌చార్జి చిలకం మధుసూదన్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, రాజంపేట పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటశివారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు అనుంపల్లె రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారాయణరెడ్డి కుమారుడు మండిపల్లి రాహుల్‌రెడ్డి, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కూనాసి సుబ్బరాజుయాదవ్, మైనార్టీ కార్యదర్శి వతన్‌నిస్సార్, టీడీపీ కార్యదర్శి మట్లి శ్రీనివాసులరెడ్డి, నియోజకవర్గంలోని పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రాంతాల టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అభిమానులు, ముస్లిం మైనార్టీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె ఉత్కంఠకు తెర


- చంద్రబాబు చేతుల మీదుగా బీ-ఫారం అందుకున్న జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 24: తంబళ్లపల్లె నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థిత్వంపై ఉత్కంఠకు తెరపడింది. బుధవారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చేతుల మీదుగా తంబళ్లపల్లె కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి బీ-ఫారం అందుకున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ బీ-ఫారం విషయమై పుకార్లు షికార్లు చేశాయి. ఈ క్రమంలో పుకార్లను కొట్టి పారేస్తూ అధినేత చంద్రబాబు జయచంద్రారెడ్డికి బీ-ఫారం అందజేశారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు శ్రీకాకుళం జిల్లా పర్యటనలో ఉన్న చంద్రబాబును జయచంద్రారెడ్డి, తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త మల్లికార్జుననాయుడు కలిసి బీ-ఫారం అందుకున్నారు. దీంతో తంబళ్లపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులు భారీ ఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.




చంద్రబాబు చేతుల మీదుగా బీ-ఫారం అందుకుంటున్న తంబళ్లపల్లె ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి

అశ్వవాహనంపై కోదండరాముడు



కాళీయమర్ధనాలంకారంలో



అశ్వవాహనంపై సీతారాములు







ఒంటిమిట్ట, ఏప్రిల్ 24 : శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి అశ్వవాహనంపై స్వామివారు దర్శనమిచ్చారు. రాత్రి స్వామివారి వాహన సేవను వాహన మండపం నుండి ప్రారంభించారు. ముందుగా ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రామాలయం నుండి వాహనం మండపాన్ని తీసుకొచ్చి అక్కడి నుండి వాహన సేవను ప్రారంభించారు. వాహన సేవ ముందు భక్తజన బృందాలు, చెక్కభజనలు, కోలాటాల తట స్వామి వారిని కీర్తిస్తుండగా మంగళవాయిద్యాల నడుమ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి అశ్వవాహనం అధిష్ఠించి భక్తులకు కల్కి స్వరూపాన్ని ప్రకటిస్తున్నారు. తన నామ సంకీర్తనతో కలిదోషాలకు దూరంగా ఉండమని ప్రబోదిస్తున్నారు.

కాళీయమర్ధనాలంకారంలో..

ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం కాళీయమర్ధనాలంకారంలో కోదండరాముడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వాహన సేవ భజనలు, కోలాటాలు, భక్తుల నడుమ వైభవంగా జరిగింది. అనంతరం ఉదయం 11 గంటలకు స్నపన తిరుమంజనం, వేడుకగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం చక్రస్నానం నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. శుక్రవారం సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు.





మోసం గురూ! నీటి పథకం ఏమైంది జగనన్నా..?

- 2019లో డిసెంబరులో శిలాఫలకం వేశారు
- నేటికీ అతీగతి లేని నిర్మాణ పనులు
- నీటి పథకం రాకపాయే.. ట్యాంకుల నిర్మాణం చేపట్టకపాయే..!
- మా దాహార్తి తీర్చే దిక్కెవరు..?
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రాయచోటి పట్టణ ప్రజలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 24: డిసెంబరు-2019లో సీఎం జగన్ రాయచోటికి వచ్చిన సందర్భంగా ప్రస్తుతం ఉన్న నీటి పథకం నుంచి వస్తున్న నీరు పట్టణ ప్రజలకు సరిపోవడం లేదన్న కారణంగా రూ.98 కోట్లతో అదనపు నీటి పథకానికి శిలాఫలకం వేశారు. అప్పటి నుంచి నేటి వరకు ఆ అదనపు నీటి పథకం పనులకు అతిగతీ లేకుండా పోయింది. ప్రస్తుతం వెలిగల్లు నీటి పథకాన్ని గాలివీడు, రాయచోటి మండలాల మీదుగా జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణానికి తీసుకొస్తున్నప్పటికీ ఆ నీరు పూర్తి స్థాయిలో రాయచోటి పట్టణానికి సరిపోవడం లేదు. మున్సిపాలిటీలో ఏరియాను బట్టి వారానికి ఒకరోజు, రెండు రోజులు, ఒక్కోచోట పది రోజులు.. ఎలా పడితే అలా వెలిగల్లు నీరు వస్తుండడంతో పట్టణ ప్రజలకు నీటి సమస్య తప్పడం లేదు. దీంతో పట్టణ ప్రజలు పలుమార్లు మున్సిపల్ అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

ఈ క్రమంలో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం డిసెంబరు నెలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాయచోటికి వచ్చిన సందర్భంగా రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి నిధులు వరదలు పారిస్తున్నామంటూ ఆర్భాటం చేసి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేసి పనులను మాత్రం గాలికి వదిలేశారు. ఇందులో భాగంగానే 300 కోట్లతో రాయచోటి మున్సిపాలిటీలో అండర్ డ్రైనేజీ పనులంటూ గొప్పలు చెప్పిన అధికార పార్టీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డితో పాటు మున్సిపల్ పాలకవర్గం కూడా పట్టణంలో ఎక్కడా అండర్ డ్రైనేజీ పనులను చేపట్టకుండా ఊరికి దూరంగా పట్టణం చుట్టుపక్కల త్వరత్వరగా అండర్ డ్రైనేజీ పనులు చేసి చేతులు దులుపుకున్నారు. ఈ క్రమంలోనే ప్రధానంగా పట్టణ ప్రజలకు నీటి సమస్యను తీర్చే క్రమంలో రూ.98 కోట్లతో వెలిగల్లు ప్రాజెక్టు నుంచి అదనపు పైపులైన్‌తో పాటు దిగువగొట్టివీడు సమీపంలో ప్రస్తుతం ఉన్న నీటిశుద్ధి కేంద్రం కాకుండా అదనంగా మరో నీటిశుద్ధి కేంద్రం ఏర్పాటు చేసి మున్సిపాలిటీ పరిధిలో 5 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మాణం కోసం పనులకు టెండర్లు పిలిచారు. అయితే పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు కేవలం వెలిగల్లు ప్రాజెక్టు నుంచి దిగువగొట్టివీడు వరకు పదిశాతం మాత్రమే పైపులైన్ ఏర్పాటు చేసి మిగిలిన పనులను చేయకుండా నిలిపివేశారు.

అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని

రూ.98 కోట్లతో చేపట్టిన వెలిగల్లు ప్రాజెక్టు నుంచి అదనపు నీటి పథకం పనుల్లో ఇంకా దిగువగొట్టివీడు వద్ద నీటిశుద్ధి కేంద్రంతో పాటు రాయచోటి మున్సిపాలిటీ వరకు సుమారు 116 కి.మీ. మేర పైపులైను పనులు, మున్సిపాలిటీ పరిధిలో 5 ఓవర్ హెడ్ నీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే గడిచిన ఐదేళ్లుగా అదనపు నీటి పథకం పనులకు అతీగతి లేకుండా పోయింది. ఫలితంగా అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా వెలిగల్లు ప్రాజెక్టు నిండా నీరున్నా రాయచోటి పట్టణ ప్రజలకు మాత్రం పూర్తి స్థాయిలో తాగునీరు అందక నీటి ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

హామీలు హుళక్కే..!

రాయచోటి మున్సిపాలిటీ గ్రేడ్‌వన్ మున్సిపాలిటీ, స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసిన అధికార పార్టీ నేతలు అదే స్థాయిలో అమాంతంగా ఇంటి నిర్మాణాలు, ఇంటి స్థలాల అప్రూవల్‌తో పాటు, నీటి కుళాయిల అప్రూవల్, ఇంటి పన్ను, నీటి పన్ను ఇలా లక్షలాది రూపాయల పన్నులు వసూలు చేస్తోంది. ఈ క్రమంలో భాగంగా రోజు మార్చి రోజు వెలిగల్లు నీరు అందిస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చెప్పిన హామీలు గాలిలో దీపాలుగా మారుతున్నాయి. దీంతో ప్రస్తుతం రాయచోటి పట్టణంలోని ప్రధాన ప్రాంతాలు మినహాయిస్తే మిగిలిన ప్రాంతాల్లో వారానికి ఒక రోజు పది రోజులకు ఒకరోజు మాత్రమే వెలిగల్లు నీరు అందుతుండడంతో పట్టణ ప్రజలకు నీటి బాధలు తప్పడం లేదు. ఐదు సంవత్సరాలుగా అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం వెలిగల్లు నుంచి రూ.98 కోట్లతో చేపట్టిన అదనపు నీటి పథకం పనుల్లో పదిశాతం కూడా పూర్తి చేయని పరిస్థితులు నెలకొనడంతో పట్టణ ప్రజల ఆశలు రోజు రోజుకు నీరుగారుతున్నాయి. దీనికి తోడు రాయచోటి పట్టణం జిల్లా కేంద్రం కావడంతో అదనంగా ఉద్యోగులతో పాటు ఇతర కార్మికులు, గ్రామీణులు జిల్లా కేంద్రానికి చేరుకోవడంతో నీటి సమస్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. అధికార పార్టీ నేతల అలసత్వంతో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఐదేళ్లుగా పూర్తికాని అదనపు నీటి పథకం పనులు ఇంకెప్పుడు పూర్తవుతాయో, నీటి బాధలు ఎప్పుడు తీరుతాయో నని రాయచోటి పట్టణ ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఇప్పటికైనా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూసి రూ.98 కోట్లతో చేపట్టిన అదనపు నీటి పథకం పనులను పూర్తిచేసి భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



వెలిగల్లు నీరు సక్రమంగా అందక ట్యాంకర్లతో నీరు పట్టుకుంటున్న దృశ్యం

ప్రజలకు తాగునీటిని అందిస్తాం

- వాసుబాబు, మున్సిపల్ కమిషనర్

రాయచోటి పట్టణానికి నిరంతరాయంగా నీటిని సరఫరా చేసే ఉద్దేశ్యంతో వెలిగల్లు ప్రాజెక్టు నుంచి రూ.98 కోట్లతో చేపట్టిన అదనపు నీటి పథకం పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు ప్రాజెక్టు నుంచి 43 కి.మీ. మేర పైపులైన్ పనులు జరిగాయి. ఇంకా దిగువగొట్టివీడు వద్ద నీటిశుద్ధి కేంద్రంతో పాటు పైపులైన్ పనులు, రాయచోటి పట్టణంలో ఐదు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న నీటి పథకం ద్వారా పట్టణంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా తాగునీటి సరఫరా చేస్తాం.

సెమిస్టరు పరీక్షా ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రారు సురేంద్రనాథరెడ్డి

కడప(ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 24: కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీలో స్కూలు ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్‌కు సంబంధించి మొదటి సెమిస్టరు రెగ్యులర్ పరీక్షల ఫలితాలను వైస్‌చాన్సలర్ ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రారు ప్రొఫెసరు సురేంద్రనాధరెడ్డిలు విడుదల చేశారు. బుధవారం యూనివర్శిటీలో పరీక్షల విభాగంతో కలిసి ఫలితాలు విడుదల చేశారు. పరీక్ష ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. అతి తక్కువ సమయంలోనే ఫలితాలను విడుదల చేసేందుకు కృషి చేసిన పరీక్ష విభాగాన్ని వీసీ, రిజిస్ట్రారు అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రారు రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ వై.పవన్‌కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఈసీ సుప్రియ పాల్గొన్నారు.

కడపకు చేరుకున్న పోలీసు అబ్జర్వర్

కడప(క్రైం), ఏప్రిల్ 24: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కడప పార్లమెంటరీ పోలీసు అబ్జర్వర్‌గా నియమితులైన హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం, సిమ్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఐపీఎస్ అధికారిగా పనిచేస్తున్న ఆర్జిత్‌సేన్‌ఠాకూర్ బుధవారం సాయంత్రం కడపకు చేరుకున్నారు. కడపలోని పోలీసు అతిథిగృహానికి ఆయన చేరుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం కడపలో కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థకౌశల్‌ను కలిసి తమ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

దాడి కేసులో ఇరువురికి జైలు శిక్ష, జరిమానా

కడప(క్రైం), ఏప్రిల్ 24: మహిళను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు దాడి చేసిన కేసులో ఒకరికి ఏడాది జైలుశిక్షతో పాటు, రూ.5 వేల జరిమానా, మరొకరికి మూడునెలలు జైలుశిక్ష విధిస్తూ జేఎఫ్‌సీ స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి హేమస్రవంతి జానకిరామ్ తీర్పునిచ్చినట్లు రిమ్స్ సీఐ రామచంద్ర తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కడప తిలక్‌నగర్‌కు చెందిన ఓ మహిళను తమ్మిశెట్టి రామసుబ్బయ్య, మంజులశ్రీనుతో కలిసి అసభ్య పదజాలంతో దూషించి ఆ మహిళపై దాడి చేయడంతో 2020లో వీరిపై కేసు నమోదైనట్లు తెలిపారు. ఈ కేసులో జడ్జి విచారించి నేరం రుజువు కావడంతో రామసుబ్బయ్యకు మూడునెలలు జైలు శిక్ష, మంజుల శ్రీనుకు ఏడాది జైలుశిక్ష విధించడంతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

రూ.11.41 కోట్ల మద్యం, నగదు సీజ్

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 24: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 44 రోజుల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలో భాగంగా చేపట్టిన తనిఖీల్లో రూ.11.41 కోట్ల విలువైన మద్యం, ఇతర వస్తువులు, నగదును అధికారులు సీజ్ చేసినట్లు కలెక్టరు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తు సామగ్రి రూ.7,64,35,209ను వివిధ విభాగాల తనిఖీ అధికారులు సీజ్ చేశారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా రూ.50 వేలకు పైబడి తీసుకెళుతున్న రూ.3,76,96,225ల నగదును సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

ఈ కాళ్లు పట్టుకోవడాలేందబ్బా..!



పెద్దిరెడ్డి కాళ్లు మొక్కుతున్న చింతల.. అదోరకంగా చూస్తున్న మిథున్, చప్పట్లు కొడుతున్న శ్రీనాథ రెడ్డి

కలికిరి, ఏప్రిల్ 24: ఆయన ఎమ్మెల్యేగా జూనియరే అయినా సీనియర్ మంత్రి. మరొకాయనేమో మంత్రి కాలేక పోయిన సీనియర్ ఎమ్మెల్యే. ఆయనా రామచంద్రారెడ్డే.. ఈయనా రామచంద్రారెడ్డే.. మరి ఈ కాళ్ల పట్టుకోవడ మేంది రామచంద్రా ! అంటూ సోమవారం నుంచి పీలేరు ప్రజల్లో తెగ చర్చ నడుస్తోంది. దీనికి తోడు పొద్దున, రాత్రి ఈ కాళ్ల పట్టుకోవడాల గురించి ఇప్పటికే జిల్లా మొత్తం అట్టుడికిపోతోంది. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి వాస్తవానికి జిల్లాలో అందరికన్నా సీనియర్ ఎమ్మెల్యే. అవును మరి చింతల రామచంద్రారెడ్డి 1988లో మొదటి సారిగా ఎమ్మెల్యేగా గెలిచారు. మరో మూడు దఫాలు తిరిగి ఎన్నికయ్యారు. పెద్దిరెడ్డి మాత్రం 1989లో తొలి సారిగా ఎమ్మెల్యే అయ్యారు. అంటే ఎమ్మెల్యేగా చింతల సీనియరే కదా అంటున్నారు. చింతల టీడీపీ, పీఆర్‌పీ పార్టీలు మారి వైసీపీలో కుదురుకున్నారు. పెద్దిరెడ్డి కూడా జనతా, కాంగ్రెస్ పార్టీలు మారి వైసీపీలో చేరి నిలదొక్కుకున్నారు. మంత్రి కూడా అయ్యారు. ఇలా వుండగా సోమవారం మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైసీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. పీలేరు సమావేశంలో వైసీపీ అభ్యర్థిత్వానికి సంబంధించిన బిఫారం చింతలకు అందజేశారు. బి ఫారం తీసుకున్న చింతల అమాంతంగా పెద్దిరెడ్డి కాళ్లకు మొక్కారు. అదే వేదిక మీదున్న మిథున్ రెడ్డి ఈ సీన్‌ను వింతగా చూస్తుండగా, పక్కనే వున్న మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి తదితరులు చప్పట్లు కొట్టారు. పీలేరు గౌరవాన్ని పెద్దిరెడ్డి కాళ్ల ముందు చింతల తాకట్టు పెట్టారని తాము చేస్తున్న ఆరోపణలకు ఇదిగో రుజువంటూ దీనికి సంబంధించిన ఫొటోలను ప్రత్యర్థి పార్టీ వాళ్లు తెగ వైరల్ చేస్తున్నారు. తనకు ఈ సారి టికెట్టు దక్కుతుందో లేదోనన్న సందేహం చింతలను పీడించేది. చివరకు బి ఫారం దక్కడంతో ఆనందంతో భావోద్వేగానికి గురై ఇలా కాళ్ల పట్టుకోవడం జరిగిందని చెప్పుకుంటున్నారు.

రేషన్ డీలర్ అక్రమాలు.. ఫిర్యాదుదారులపై దౌర్జన్యం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 24: మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ అమృతనగర్‌లోని 143 రేషన్‌డీలర్ నిజాం సరుకులు సక్రమంగా పంచకుండా అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ రేషన్‌బియ్యం, చెక్కర అమ్ముకుంటున్నాడని స్థానికులు బుధవారం సాయంత్రం డిప్యూటి తహసీల్దారు సాయినాథరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీన్ని జీర్ణించుకోలేని డీలర్, ఎండీయూ ఆపరేటర్ నిజాం, అతని భార్య కుటుంబ సభ్యులతో కలిసి తమపైనే ఫిర్యాదు చేస్తారా అని స్థానిక మాజీ విలేకరి గిద్దలూరు నాగరాజుపై దాడి చేశారు. అతని స్టూడియో అద్దాలు పగులగొట్టి కంప్యూటర్లు ధ్వంసం చేశారు. ఈ దాడిలో గాయపడిన నాగరాజును స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు దాడి ఘటనపై బాధితుడి స్టూడియో వద్దకు వెళ్లి విచారించారు. అనంతరం నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ నాగేశ్వరరావు తెలిపారు.



దాడిలో ధ్వంసమైన అద్దాలు, కంప్యూటరు, (ఇన్‌సెట్లో) దాడికి గురైన నాగరాజు

విజయవాణిలో ఉత్తమ ఫలితాలు



ప్రతిభ కనబర్చిన వైష్ణవి, చర్మిళ, రిషిత, కార్తీక్, గణేష్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24: చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం విజయవాణి నగర్‌లోని విజయవాణి పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర్‌మూర్తి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో 111 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 110 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జి.వైష్ణవి 583 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. జి.చర్మిళ 577, ఎం.గణేశ్ 571, ఎం.కార్తీక్ 571, ఎం.రిషిత 572 మార్కులు సాధించినట్లు తెలిపారు. మరో 36 మంది 500 మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపా ధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ జ్యోతి రాణి, హెచ్‌ఎం కరుణ, అకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాయుని గురుప్రసాద్ అభినందించారు.

వైభవంగా ఉరుసు మహోత్సవం

కమలాపురం రూరల్, ఏప్రిల్ 24: కమలాపురం ఉరుసు మహోత్సవంలో భాగంగా మూడో రోజు ప్రభుత్వ లాంచనాలతో ఛాదర్ సమర్పించారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు దేశ నలుమూలల నుంచి ఈ ఉరుసు మహోత్సవానికి స్వామివారు భక్తులు తరలి వచ్చారు. ఉరుసు ఊరేగింపు సందర్భంగా రాత్రికి మేళ తాళాలతో, చిన్నారుల కేరింతలతో, ఫక్కీరు విన్యాసాలతో బాణసంచా పేలుస్తూ తీసుకువచ్చారు. ప్రస్తుత మఠాధిపతి ముతవల్లి హజరత్ ఫైజుల్ గఫాచాఖాద్రి, ఆయన సోదరులు పాల్గొన్నారు.

అనంతరం దర్గా ఆవరణంలో పాలదంతాలు గల వృషభరాజములచే నిర్వహించిన బండలాగుడు పోటీల విజేతలకు బహుమతులను కన్వీనరు ఇస్మాయిల్, కమిటీ సభ్యులు అందించారు.

డాక్టర్ కావాలని కష్టపడ్డాను..
ఇప్పుడు నాన్న కోసం కష్టపడుతున్నా

- కోర్టులకు, ఆఫీసులకు వెళ్లాను.. ఇప్పుడు మీ వద్దకు వచ్చాను
- వివేకాకు న్యాయం చేయాలంటే షర్మిలను గెలిపించండి : డాక్టర్ సునీత

లింగాల, ఏప్రిల్ 24: 'నేను చదువుకునే సమయంలో నాన్న ఒక మాట అనేవారు.. బాగా కష్టపడి డాక్టర్ కావాలని. దానికోసం ఎంత కష్టపడ్డానో.. ఇప్పుడు ఆ మాట అన్న నాన్న కోసం అంతకంటే ఎక్కువ కష్టపడుతున్నా' అని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ వైఎస్ సునీత అన్నారు. మండలంలోని వెలిదండ్ల, కోమన్నూతల, లింగాల, పార్నపల్లె తదితర గ్రామాలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని బుధవారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివేకానందరెడ్డి కూతురుని, మీ ఆడబిడ్డను అన్నారు. తమ అమ్మ సౌభాగ్యమ్మది ఈ ఊరే అని, వైఎస్ వివేకానందరెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిల గురించి తనకంటే మీకే బాగా తెలుసన్నారు. ఎప్పుడు ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారన్నారు. ఆఖరు వరకు పులివెందుల ప్రజల గురించి ఆలోచించారన్నారు. అప్పటిలోనే చెన్నైలో తాను చదువుకునే సమయంలో తన తండ్రి అక్కడకు వచ్చేవారని, కష్టపడి చదివి డాక్టర్ అయి అందరికీ సేవ చేయాలన్నారు. అందుకోసం ఎంత కష్టపడ్డానో ఇప్పుడు నాన్న కోసం అంతే కష్టపడాల్సి వస్తోందన్నారు. మీ ఇంటి ఆడపడుచు సౌభాగ్యమ్మకు ఈ అన్యాయం జరిగిందని, మనం చూస్తూ ఉండవచ్చా అని ప్రజలను అడిగారు. వివేకానందరెడ్డి వద్దకు మీరు ఎప్పుడైనా వెళితే మీరు ఏ పార్టీ, ఏ కులం, ఏ జాతి అని చూడకుండా ఎవరు వెళ్లినా సహాయం చేసేవారన్నారు. ఇప్పుడు ఆయన కోసం మిమ్మల్ని ప్రాధేయపడుతున్నా న్యాయం చేయండి అని వేడుకొన్నారు. నిందితులకు ఓటు వేయొద్దని, న్యాయం కోసం ఓటు వేయాలని కోరారు. వివేకాకు న్యాయం చేయాలంటే ఈ పని చేయాలని, అప్పుడే ఎవరైనా తప్పు చేయాలంటే భయపడతారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముద్దుల కుమార్తె వైఎస్ షర్మిలను ఎంపీగా గెలిపించుకోవాలన్నారు. ఐదేళ్లుగా న్యాయం కోసం ప్రతి కార్యాలయానికి, కోర్టులకు, ఆఫీసులకు వెళ్లి కొట్లాడి.. కొట్లాడి మీ వద్దకు వచ్చానన్నారు. వివేకానందరెడ్డిని అంతగా క్రూరంగా నరికి నరికి చంపారన్నారు. తమకంటే మీతోనే ఎక్కువగా ఉన్న వ్యక్తికి ఇంత అన్యాయం జరిగితే చూస్తూ ఉంటారా అన్నారు. నిందితులకు ఓటు వేయొద్దు, వైఎస్ షర్మిలకు ఓటు వేసి గెలిపించి వివేకానందరెడ్డికి న్యాయం చేయాలని కోరారు. అలాగే పులివెందుల కాంగ్రెస్ అభ్యర్థి ధ్రువకుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి, ధ్రువ కుమార్‌రెడ్డి, శివప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సునీత

28న మారెమ్మ జాతర

కడప(కల్చరల్), ఏప్రిల్ 24: మారెమ్మతల్లి ఆలయ 20వ వార్షికోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని కడప నగర 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లెలో ఈ నెల 27, 28వ తేదీల్లో జాతర మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు రెడ్డిచెర్ల జయరామిరెడ్డి తెలిపారు. తొలుత 27న అమ్మవారికి గణపతిపూజ, రుద్రాభిషేకం, మహానైవేద్యం, మహా మంగళహారతి, మంత్రపుష్పం, సాయంత్రం 6 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం వుంటుందన్నారు. తదుపరి 28న జాతర కార్యక్రమం, అమ్మవారికి నిండు కుండ బోనాల సమర్పణ ఉంటుందన్నారు. అనంతరం న్యూకేటగిరి విభాగ వృషభరాజములచే బండలాగుడు పోటీలుంటాయని తెలిపారు. ఇందులో గెలుపొందిన ప్రథమ విజేతకు రూ.60 వేలు, ద్వితీయ విజేతకు రూ.40వేలు, తృతీయ విజేతకు రూ.30 వేలు, నాల్గవ విజేతకు రూ.20 వేలు, ఐదవ విజేతకు రూ.10వేలు, ఆరవ విజేతకు రూ.5వేలుగా నగదు బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. కాగా మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు కోలాటం కార్యక్రమం వుంటుందన్నారు.



మారెమ్మతల్లి మూలవిరాట్

వైసీపీ జెండా పట్టుకో... బిర్యాని అందుకో

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 24: వైసీపీ అభ్యర్థి నామినేషన్‌కు రండి.. డబ్బుతో పాటు బిర్యాని పొట్లం అందుకోండంటూ ప్రచారం చేయడంతో.. బుధవారం వైసీపీ అభ్యర్థి నిస్సార్ అహ్మద్ నామినేషన్ ర్యాలీలో పెద్దసంఖ్యలో పేదలు పాల్గొ న్నారు. ర్యాలీలో పాల్గొన్న వారందరికీ స్థానిక బేబీ వెల్‌కమ్ హోమ్ స్థలంలో బిర్యానీ వడ్డించారు. ఈ సందర్భంగా వైసీపీ జెండాలు, ప్లకార్డులు పట్టుకున్న వారందరు వాటిని పారవేసి తొక్కుకుంటూ బిర్యానీకి ఎగబడ్డారు. అంత వరకు జై జగన్ అంటూ నినాదాలు చేసిన వారు ఘుమఘుమలాడే బిర్యాని వాసన రాగానే జగన్ జెండాలు పారేసి కడుపారా లాగించేసి వెళ్లి పోయారు. కాగా.. వైసీపీ అభ్యర్థి నామినేషన్ సందర్భంగా ఉదయం 10గంటల నుంచి మదనపల్లెలో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో అప్పారావు వీధి, త్యాగరాజు వీధి నుంచి ప్రభుత్వాస్పత్రికి వెళ్లవారికి దారి లేక జనం అవస్థలు పడ్డారు. అదే విధంగా సీటీఎం రోడ్డు, బెంగళూరు రోడ్డు మార్గాల్లో వెళ్లే వాహనదారులు వైసీపీ నాయకులను తిట్టుకుంటూ రెండు కిలోమీటర్లు చుట్టు తిరిగి వెళ్లాల్సి వచ్చింది.



బేబీ వెల్‌కమ్ హోమ్ స్థలంలో బిర్యాని కోసం ఎగబడుతున్న జనాలు



ఎంగిలి ప్లేట్లతో పాటు పారేసిన వైసీపీ జెండాలు

జగన్‌రెడ్డి ఓటమితోనే మాదిగలకు ఉజ్వల భవిష్యత్

- ఏపీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

కడప(మారుతీనగర్) ఏప్రిల్ 24: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత సీఎం జగన్‌రెడ్డిని ఓడించడం ద్వారానే రాష్ట్రంలోని మాదిగలకు ఉజ్వల భవిష్యత్తు దక్కుతుందని ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగలకు సూచించారు. రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా బుధవారం కడప ప్రెస్ క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు రక్షణ కొరవడిందని, ఏపీని గాడిలో పెట్టే సత్తా చంద్రబాబుకే వుందని, ఆ దిశగా దళితులు చైతన్యవంతులు కావాలన్నారు. అనంతరం ముద్రించిన కరపత్రాలను 35 మాదిగ, మాదిగ ఉపకులాల నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. వైసీపీ పాలనలో గత 5 సంవత్సరాలుగా ఎస్సీలకు సంబంధించిన 27 పథకాలను జగన్‌రెడ్డి రద్దుపరచి దళితుల నోట్లో మట్టికొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నవరత్నాలు, అమ్మఒడి పేరుతో ఎస్సీ కార్పొరేషన్ నిధులను, అలాగే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దండుకుని దళితుల నోటికందే కూడు దక్కకుండా చేసిన ఏకైక సీఎంగా జగన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. మాదిగ జాతికి అండగా నిలబడిన టీడీపీ అధినేత చంద్రన్నకే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మాదిగలు అండగా నిలవాలని కోరారు. గత ఎన్నికల ముందు కోడికత్తి డ్రామా ఆడిన జగన్‌రెడ్డి ప్రస్తుతం ఓటమి భయంతో గులకరాయి డ్రామాకు తెరతీయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. జగన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేస్తే రాష్ట్రం మరో బీహార్ కావడం తథ్యమన్నారు. సమావేశంలో మాదిగ సంఘాల నాయకులు ఆర్.జె. ప్రకాష్, రమేష్, మునెయ్య, జిల్లా అధ్యక్షుడు శివ, కె.బెంజిమెన్, పి.సుబ్బయ్య, సుబ్బారావు, వి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మా ఆత్మీయ స్వాగతం
ప్రజాగళం
ఎన్నికల శంఖారావంలో భాగంగా
నేడు రాజంపేట, రైల్వేకోడూరులలో
జరుగు
ప్రజాగళం
కార్యక్రమానికి
విచ్చేయుచున్న మా నాయకులు
శ్రీ నారా
చంద్రబాబు నాయుడు,
శ్రీ పవన్ కళ్యాణ్ గార్లకు
స్వాగతం..
సుస్వాగతం...
రాజంపేట, రైల్వేకోడూరు
నియోజకవర్గాలలోని
తెలుగుదేశం, బీజేపీ,
జనసేన పార్టీల నాయకులు,
కార్యకర్తలు మరియు
ప్రజలందరూ విచ్చేసి బహిరంగ సభలను
జయప్రదం చేయవలసిందిగా కోరుచున్నాము...
బహిరంగ సభ : ఏప్రిల్ 25, 2024
మ॥ గం॥ 3.00 నుండి 4.30 ని॥ల వరకు
స్థలం : పాతబస్టాండ్,
రాజంపేట.
సాయంత్రం 5.00 గంటలకు
పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేద్కర్
విగ్రహం వద్ద, మెయిన్ రోడ్, రైల్వేకోడూరు
సైకిల్ గుర్తుకు ఓటేద్దాం... తెలుగుదేశం పార్టీని గెలిపిద్దాం
వేమన సతీష్
టి.డి.పి. రాష్ట్ర కార్యనిర్వాహక
కార్యదర్శి

సుగవాసికి జై కొట్టిన బీసీఆర్ వర్గం

● సంపూర్ణ మద్దతిస్తూ ప్రకటన ● నిరాడంబరంగా బాలసుబ్రమణ్యం నామినేషన్ ● ప్రతాప్‌రాజు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం



సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళుతూ విక్టరీ గుర్తును చూపుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి వేమన సతీష్, టీడీపీ నేత పోలి సుబ్బారెడ్డి, రాజంపేట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మల్లెల శ్రీవాణి

రాజంపేట, ఏప్రిల్ 24 : రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాల సుబ్రమణ్యం ఎటువంటి హంగు ఆర్భాటం లేకుండా నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో రాజంపేట టీడీపీ కార్యాలయం నుంచి బయలుదేరి రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల అధికారి మోహన్‌రావుకు తన నామినేషన్ దాఖలు పత్రాలను అందజేశారు. న్యాయవాది సింగెశెట్టి రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకులు పోలి సుబ్బారెడ్డి, రాజంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లెల శ్రీవాణి, తానా మాజీ అధ్యక్షుడు సతీష్ వేమన పాల్గొన్నారు.

తన బ్యాగును తానే మోసుకుంటూ..

హంగూ, ఆర్భాటం, ర్యాలీలు లేకుండా సుగవాసి తన సహజ రీతిలో సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బ్యాగును తమకు ఇవ్వాలని అనుచరులు కోరినా, తన బ్యాగును తానే మోసుకుంటూ వెళ్లి ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు.

జై కొట్టిన బీసీఆర్ వర్గం

తెలుగుదేశం పార్టీలో బుధవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. టికెట్టు రాని టీడీపీ ఇన్‌చార్జి బీసీఆర్ వర్గంలోని ప్రధాన నేతలంతా రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్‌రాజు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రంఆత్మీయ సమావేశాన్ని నిర్వహించి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంతో చేతులు కలిపి మద్దతు తెలిపారు. వీరిలో ప్రతాప్‌రాజుతో పాటు టీడీపీ పార్లమెంటు మహిళాధ్యక్షురాలు అనసూయమ్మ, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, రాజంపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు డీఆర్ఎల్ మణి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కొల్లు రెడ్డయ్య నాయుడు, నందలూరు మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, పెద్దకారంపల్లె టీడీపీ యువ నేత రమణరాజు, ఆడిటర్ ఎస్ఎస్ పంత్, మాజీ ఎస్ఐ శ్రీనివాసులనాయుడు, జనసేన పార్టీ లీగల్ సెల్ పార్లమెంటు అధ్యక్షుడు కరుణాకర్‌రాజు, పెద్దకారంపల్లె మాజీ ఎంపీటీసీ సభ్యుడు డాక్టర్ హెచ్.వి.రాజు, బీసీఆర్ సునీల్, రాష్ట్ర రంజక సంఘం నాయకుడు రాంనగర్ నర్సింహ తదితరులు తమ నాయకుడు బీసీఆర్ ఆదేశాల మేరకు సుగవాసి బాలసుబ్రమణ్యంకు మద్దతు తెలుపుతున్నట్లు సమావేశంలో ప్రకటించారు. టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యంను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని వారు హామీ ఇచ్చారు.

● పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరిక

బోయనపల్లెకు చెందిన వైసీపీ నాయకులు మేరువ శివ, బోయనపల్లె యువ నాయకులు బోగా రామకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో పలువురు యువకులు సుగవాసి బాలసుబ్రమణ్యం సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన టీడీపీ కండువా కప్పి వారిని టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● ఎన్ని అవరోధాలు ఎదురైనా

పార్టీ వీడనందుకే : సుగవాసి

రెండు సార్లు ఎమ్మెల్యే టికెట్టు రాకపోయినా, కొందరి కారణంగా ఇబ్బందులు ఎదురైనా తాను టీడీపీని వీడకుండా, పార్టీ విజయానికి కృషి చేసినందుకే.. పార్టీ అధినేత తనను గుర్తించి రాజంపేట టికెట్టు ఇచ్చారని సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. తనకు సొంత ఎజెండా ఏదీ లేదని, ఉన్నదంతా పార్టీ అధినేత అజెండానే అన్నారు. పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పనిచేస్తానన్నారు. తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా ఎన్నికుంటే ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, కార్యకర్తలు, నేతల రుణాన్ని తీర్చుకుంటానని విన్నవించారు. వైసీపీ నేతల ఇసుక దాహానికే అన్నమయ్య ప్రాజెక్టు తెగి అనేక మంది కొట్టుకుపోయి చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టకాలంలో టీడీపీకి అండగా నిలిచి ఇబ్బందులు ఎదుర్కొన్న రాజంపేటకు చెందిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తానని హామీ ఇచ్చారు.

● తాళ్లపాక నేతల సంపూర్ణ మద్దతు

ఎమ్మెల్యే అభ్యర్థి సోదరుడు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు సమక్షంలో తాళ్లపాక నాయకులు సుదర్శన్ థియేటర్, సుదర్శన్ కళ్యాణ మండపం అధినేతలు జవ్వాజి అదృష్ట దీపుడు, జవ్వాజి మోహన్‌రావు, జవ్వాజి సుబ్రమణ్యం, జవ్వాజి సుదర్శన్, జవ్వాజి నారాయణ సోదరులు బాలసుబ్రమణ్యంకు సంపూర్ణ మద్దతు పలికారు. ఆ గ్రామానికి చెందిన కొత్తపల్లె నరేంద్ర, జవ్వాజి హరికృష్ణ, ఆ గ్రామ పెద్దలు లక్ష్మీనరసయ్యరాజు, రామాంజులరాజు, పాండురాజు, గొల్ల రామకృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం సోదరుడు సుగవాసి ప్రసాద్‌బాబు, జనసేన పార్టీ నియోజకవర్గ నేత అతికారి కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు బాలిశెట్టి హరిప్రసాద్, ఊటుకూరు మాజీ సర్పంచ్ ఎం.ఎల్.నారాయణ, లక్ష్మీనరసయ్య, గీతాంజలి కళాశాల కరస్పాండెంటు ఎస్.వి.రమణ, బలిజసంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

● తాళ్లపాక అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి

తన సోదరుడికి మద్దతు పలికిన తాళ్లపాకవాసులనుద్దేశించి టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని, తనకు మద్దతు పలికిన జవ్వాజి సోదరులతో పాటు మిగిలిన నాయకులందరినీ ఎల్లవేళలా గుర్తుచేసుకొని వారి రాజకీయ అభ్యున్నతికి పాటుపడతానన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత ఆదేశాల మేరకు టికెట్టు వచ్చిన తమ సోదరుడు సుగవాసి బాలసుబ్రమణ్యంను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు.

● శ్రీ అన్నమాచార్య అధినేత మోదుగులతో చర్చలు

శ్రీ అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత, టీడీపీ సీనియర్ నేత మోదుగుల పెంచలయ్యతో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు చర్చలు జరిపారు. కళాశాలకు వెళ్లి ఆయన మద్దతు కోరారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ సుగవాసి బాలసుబ్రమణ్యంను రాజంపేట ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజియన్ మాజీ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు,ఆర్టీసీ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జనసేననేత వెంకటేశ్వరరావు, కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

● హెలిప్యాడ్ పరిశీలన

గురువారం సాయంత్రం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన నేత పవన్‌కళ్యాణ్ రాజంపేట ఎన్నికల ప్రచారానికి వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లను జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు అతికారి కృష్ణ, అతికారి దినేష్ తదితరులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు లీగల్ సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, కాకతీయ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు శివన్నారాయణ చౌదరి, గీతాంజలి కళాశాల కరస్పాండెంటు ఎస్.వి.రమణ, బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు కె.ఎస్.నరసింహ, మాజీ మాజీ సర్పంచ్ ఎం.ఎల్.నరసయ్య పాల్గొన్నారు.

తరలివచ్చిన రాయచోటి మైనార్టీలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 24: రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం నామి నేషన్ కార్యక్రమానికి బుధవారం రాయచోటి మైనార్టీ నేతలు తరలివెళ్లారు. రాజంపేటలో అట్టహాసంగా సాగిన టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం నామినేషన్ కార్యక్రమానికి రాయచోటి మైనార్టీ నేతలు ఇర్షాద్‌అలీఖాన్, హోటల్ ఫారూఖ్, ఖాదర్ బాషా, ఎస్‌కెహెచ్ ఖాదర్‌హుస్సేన్ తదితరులు రాజంపేటకు తరలివెళ్లి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని సుగవాసి సుబ్రమణ్యంకు శుభాకాంక్షలు తెలియజేశారు.



సుగవాసి ప్రసాద్ బాబు సమక్షంలో మద్దతు పలుకుతున్న తాళ్లపాక నేతలు సుదర్శన్ థియేటర్ ఎండీ జవ్వాజి అదృష్ట దీపుడు, వారి సోదరులు



బీసీఆర్ వర్గీయుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పరిశీలకుడు దుర్గా ప్రసాద్, చిత్రంలో జగన్‌మోహన్‌రాజు, సుగవాసి బాలసుబ్రమణ్యం తదితరులు



అద్దేపల్లి ప్రతాప్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న బీసీఆర్ వర్గీయులు

నేటి నుంచి అసర్ల గంగమ్మ తిరుణాల

గాలివీడు, ఏప్రిల్24: మండలంలోని పేరంపల్లె పంచాయతీ వడ్డెపల్లె సమీపంలో వెలసిన అసర్ల గంగమ్మ తిరుణాల నేటి నుంచి ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. గురువారం రాత్రికి అమ్మవారికి భక్తులు చాందినీ బండ్లను తిప్పుతారని, శుక్రవారం ఉదయం బోనాలు సమర్పిస్తారని తెలిపారు.

గుండెపోటుతో వార్డు మెంబర్ మృతి

పెనగలూరు, ఏప్రిల్ 24 : నారాయణనెల్లూరు గ్రామ పంచాయతీ 9వ వార్డు మెంబర్ ఉప్పు ప్రకాష్‌రావు (63) బుధవారం మధ్యాహ్నం గుండెపోటుతో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని సర్పంచ్ కేతాచక్రపాణి సందర్శించి నివాళులర్పించారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాలు వందశాతం లక్ష్యాలు సాధించాలి

● డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 24: పట్టణ ఆరోగ్య కేంద్రాలు వందశాతం లక్ష్యాలను సాధించాలని అన్నమయ్య జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి (డీపీఎంవో) డాక్టర్ రియాజ్‌బేగ్ అన్నారు. బుధవారం ఆయన రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రం వాల్మీకి స్ట్రీట్‌లో వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న సెక్టార్ మీటింగ్‌ను ఏపీ డెమోలజిస్ట్ వెంకటేశ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూపీహెచ్‌సీలలో వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రతిరోజు టెలిమెడిసిన్ సేవలు అందించాలని, అర్బన్‌లో వ్యాధి నిరోధక టీకాల ప్రగతి చాలా తక్కువగా ఉందని, ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసుకుని లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. ఓఆర్ఎస్ కార్నర్ ఏర్పాటు చేసుకుని అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఫార్మసిస్ట్‌ను ఆదేశించారు. ఐహెచ్‌ఐపీ పోర్టల్‌లో రోజువారీ నివేదికలు అప్డేట్ చేయాలని ఎల్‌టీని ఆదేశించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీ సమావేశం ప్రతినెలా నిర్వహించి జాతీయ ఆరోగ్యమిషన్ నిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే, డ్రైడే నిర్వహించాలని, వివరాలను యాప్‌లో ఏఎన్‌యం అప్డేట్ చేయాలని తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఎండలు పెరుగుతున్న దరిమిలా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



మాట్లాడుతున్న డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్

ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగకుండా ఉండడం, గొడుగులు, టోపీలు, చలవ అద్దాలు వాడటం వంటి జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య పర్యవేక్షకులు నూర్జహాన్, ఫార్మసిస్ట్ తదితరులు పాల్గొన్నారు.

నల్లారి నామినేషన్‌కు తరలిన జనసేన నేతలు



నామినేషన్‌కు తరలివెళ్తున్న జనసేన నాయకులు

సుండుపల్లె, ఏప్రిల్ 24: మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా జనసేన పార్లమెంటు సమన్వయ కర్త యల్లటూరి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో తరలివెళ్లినట్లు మాజీ జెడ్పీటీసీ, జనసేన నేత శివరామరాజు తెలిపారు. సోమవారం సుండుపల్లె జనసేన కార్యాలయం, సుండుపల్లె మండలం, వీరబల్లి మండలాల నుంచి 30 వాహనాల్లో నామినేషన్‌కు వెళ్లారన్నారు. ఈ కార్యక్రమంలో చలపతి, ఒంటేరు రాజా, మౌలా, నారాయణ, శీను, మున్నా తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డిపల్లె నుంచి తెలుగుదేశం పార్టీ మండల యువజన నాయకుడు ఆరీపుల్లా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మదన్, నసీరుద్దీన్, జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాజంపేట పార్లమెంటు యూత్ ప్రెసిడెంటు తోపిరెడ్డి నవీన్ కుమార్‌రెడ్డి, బషీర్ తదితరులు వెళ్లారు.

నందలూరు: నందలూరు నుంచి రాజంపేట అసెంబ్లీ కో-కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్, మైనారిటీ నాయకులు షబ్బీర్ అహమ్మద్, ఎస్టీ మోర్చా నేత పోతురాజు మస్తానయ్య, సీనియర్ నేత విఠలాచార్య, విస్తారక్ ఆదినారాయణ, ఏనుగుల బాలాంజనేయులు, యువ మోర్చా చుక్కా శ్రీనివాసులు ఇతర నాయకులు తరలివెళ్లారు.

'జనసేనతోనే కోడూరు అభివృద్ధి'



ప్రచారంలో పాల్గొన్న ఎన్డీఏ నాయకులు

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 24: జనసేన గెలుపు కోడూరు అభివృద్ధికి మలుపు నినాదంతో కూటమి నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. బాబు సూపర్ సిక్స్ డోర్ టు డోర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని నరసారంపేట, వెంకటేశ్వరపురం, న్యూ క్రిష్ణానగర్, పాత కృష్ణ, వినాయక నగర్, జగడంపల్లిలో జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను వివరించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం జనసేన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నార్జల హేమరాజ్, టీడీపీ పట్టణ కన్వీనర్ పొకల మణి, మైనారిటీ నాయకులు పట్టాన్ మౌలా, మస్తాన్, మహిళ నాయకురాలు మెహతాజ్, పోతురాజు సుమన్ పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ సభను జయప్రదం చేయండి

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 24: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ప్రజాగళం సభను జయప్రదం చేయాలని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని మైసూరివారిపల్లె పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను ఆయన పరిశీలించారు. పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, చిట్వేలి మండలం అధ్యక్షుడు కె.కె.చౌదరి, ఓబులవారిపల్లి మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నాయుడోరి రమణ చిట్వేలి నాయకులు రాజా తదితరులు పాల్గొన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఒకేసారి మొట్టమొదటిసారిగా కోడూరు వస్తుండడంతో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హెలిపాడ్ నుంచి రోడ్డు మార్గంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ప్రజాగళం సభకు చేరుకుంటారన్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లి, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భారీ సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పెనగలూరు : ప్రజాగళం బహిరంగ సభను జయప్రదం చేయాలని మండల క్లస్టర్ ఇన్‌చార్జి కె.నాగేశ్వరరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బాలకృష్ణ, రాజంపేట పార్లమెంటు తెలుగు యువత కార్యదర్శి ఎన్.రాంప్రసాద్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి కె.కళాచంద్ర , కెకె చౌదరి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

పెనగలూరు, ఏప్రిల్ 24: మండలంలోని ఓబిలి హరిజనవాడలో బుధవారం ఉదయం సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించారు. పిడతల వెంకట సుబ్బయ్య స్వామి వ్యాఖ్యానం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీతో పాటు మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో చెక్కభజన, గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఇండ్లూరు లో గురువారం సాయంత్రం సీతారాముల కళ్యాణం జరుగుతుందని ఉదయం పంచామృతాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అరటి తోటకు నిప్పు.. ఐదెకరాల్లో నష్టం

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 24 : గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మండల పరిధిలోని ముక్కావారిపల్లెలో ఎర్రబాపు శంకర్‌రెడ్డికి సంబంధించిన 5 ఎకరాల అరటితోట కాలిపోయింది. మంటలంటుకున్న విషయం గుర్తించిన స్థానికులు రైల్వేకోడూరు ఫైర్ ఆఫీసుకు తెలియజేయగా వెంటనే వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ సంఘటనతో సుమారు 10 లక్షలపైన నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయారు.

మద్యం దుకాణాలపై ప్రత్యేక నిఘా.!

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్24: ప్రభుత్వ మద్యం దుకాణాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు అన్నమయ్య జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ టీం నోడల్ అధికారి చంద్రా నాయక్ తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణంలోని పలు మద్యం దుకాణాలను ఫ్లయింగ్ స్క్వాడ్ టీం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మద్యం నియంత్రణ కోసం జిల్లాలోని మద్యం డిపోతో పాటు మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ ఎప్పటి కప్పుడు జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకువెళు తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట డి ప్యూటీ తహసీల్దార్ జయసింహ, ఎక్సైజ్ సీఐ- రామకృష్ణ శాస్త్రి, ఇన్‌స్పెక్టర్ గాయత్రి, జీఎస్‌టీవో అధికారి హేమంత్‌కుమార్, టీం సభ్యులు సుధాకర్, విజయ్, రెడ్డినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 24: ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగిం చుకోవచ్చునని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సమ్మత్ ఖాన్ ,వీఆర్వో లు అన్నారు. బుదవారం స్థానిక మూడురోడ్ల కూడలిలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండ లంలో 33 పోలింగ్ కేంద్రాలు ఉండగా, అన్ని పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రజలు తమ ఓటును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో లు సిద్దయ్య, వీఆర్ఏలు పాల్గొన్నారు

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా : ఎస్ఈ

పుల్లంపేట, ఏప్రిల్ 24 : క్షేత్ర స్థాయిలో విద్యుత్ సమస్యలను పరి ష్కరించి వినియోగదారులకు, రైతు లకు అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందిస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈ ఎస్.రమణ తెలిపారు. బుధ వారం ఆయన దళవాయిపల్లె సబ్‌స్టేషన్‌లో పుల్లంపేట ట్రాన్స్‌ఫార్మర్‌ల ను పరిశీలించారు. అనంతరం దళ వాయిపల్లె 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. రైతుల విద్యుత్ సమస్యలపై స్పందించి సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్‌లకు ఫీజులు వేయించడం, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ల స్థానంలో మార్పు చేయాలన్నారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని, వాలిపోయిన స్తంభా లు, ఫీజు లైన్లు సరిచేయాలన్నారు. పుల్లంపేట మండల ప్రధాన కేంద్రంలో విద్యుత్ సమస్యను అధిగమించేందుకు ఏబీ స్విచ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ సుబ్రమణ్యం, ఏఈ చంద్రశేఖర్, జేఈ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 24: రాయచోటి మండల పరిధిలోని యండపల్లె గ్రామం దిగువ హరిజనవాడ సమీపంలో తిరుణాల సందర్భంగా జరిగిన ఓ వ్యక్తిపై దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. యండపల్లె గ్రామం దిగువ హరిజనవాడ వద్ద మంగళవారం రాత్రి గంగాధర మరికొందరు లక్ష్మయ్యపై దాడి చేసి గాయపరిచారు. దీంతో తల పై తీవ్రగాయాలైన లక్ష్మయ్యను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించి, అతని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు

పుల్లంపేట, ఏప్రిల్ 24 : పుల్లంపేట మండల పరిధిలో 2013లో జరిగిన ఒక హత్యాయత్నం కేసులో శ్రీధర్ రెడ్డి, దేశిబోయిన శ్రీనివాసులుకు బుధవారం కోర్టు శిక్ష ఖరారు చేసింది. ఈ దాడి కేసును విచారించిన రాజంపేట ఏఎస్‌జె కోర్టు జడ్జి బుధవారం నిందితులకు రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు 20వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.



గెలుపులో మహిళా ఓటర్లే కీలకం

మహిళా ఓట్లు: 7,88,725

పురుష ఓట్లు: 7,65,903

30-39 ఏళ్ల వయసున్న ఓటర్లే అధికం

జిల్లాలో మొత్తం 15,54,712 మంది ఓటర్లుండగా, 30-39 మధ్య వయసున్నవారే ఎక్కువగా 4,06,176 మంది ఉన్నారు.

● తొలిసారి ఓటేసేవారు (18-19 ఏళ్ల వయసు) 33,495 మంది ఉన్నారు.

- చిత్తూరు కలెక్టరేట్



బైండోవర్ అంటే..

ఎన్నికల సమయంలో ప్రత్యేకంగా బైండోవర్ కేసులు నమోదు చేస్తుంటారు. బైండోవర్ అంటే (బాండ్ వర్ గుడ్ బిహేవియర్) అని అర్థం. ఎన్నికల వేళ ఎవరి వల్లనైనా శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించినా, అతడి చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని తెలిస్తే పోలీసులు బైండోవర్ చేస్తారు. అనంతరం తహసీల్దార్ లేదా ఆర్డీవో వద్ద హాజరు పరుస్తారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించబోమని అతడి నుంచి బాండ్ పేపర్‌పై లిఖితపూర్వకంగా తీసుకుని అతడికి సంబంధిత తహసీల్దార్లు ప్రొసీడింగ్స్‌ను ఇస్తారు. అలా బైండోవర్ అయిన వ్యక్తి అదే రోజు నుంచి ఏడాది వరకు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు. అలా పాల్పడితే లిఖితపూర్వకంగా ఇచ్చిన బాండులో ఎంత మొత్తం నమోదు చేసి ఉన్నారో అంతమొత్తం పెనాల్టీ రూపంలో చెల్లించాల్సి ఉంది. అలా చెల్లించకపోయినా నేరం కిందనే పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్లు 106, 107, 108, 110 కింద రెండు, అంతకన్న ఎక్కువసార్లు బైండోవర్ అయితే అతడిపై రౌడీషీట్ నమోదు చేసే అవకాశం ఉంది. తమపై అక్రమంగా పోలీసులు బైండోవర్ కేసులు పెట్టారని ఎవరైనా పౌరులు భావిస్తే హైకోర్టులో రిట్ పిటిషన్‌ను దాఖలు చేసుకోవచ్చు. పోలీసులకు నోటీసులు కోర్టు జారీచేసి రెండు వర్గాల వాదనలు విన్నతరువాత కేసుపై నిర్ణయం తీసుకుంటుంది.

- చిత్తూరు

ప్రభుత్వ బడుల్లో తగ్గిన 16 వేల మంది


పునర్విభజన అనంతరం చిత్తూరు జిల్లాలోని 2468 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1,69,191 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ సంఖ్య 2023-24 విద్యా సంవత్సరం నాటికి 1,52,557కి పడిపోయింది. ఏడాదిలోనే 16,634 మంది విద్యార్థులు ప్రభుత్వ బడులకు దూరమయ్యారు. అదే సమయంలో ప్రైవేటు బడుల్లోని విద్యార్థుల సంఖ్య 2022-23 నాటికి 32792 మంది ఉండగా, 2023-24 నాటికి ఈ సంఖ్య 37772కు చేరింది. అంటే.. ప్రభుత్వ బడులకు దూరమైన విద్యార్థుల్లో 4980 మంది ప్రైవేటు పాఠశాలల్లో చేరారని భావించొచ్చు. మిగిలిన 11,811 మంది విద్యార్థులు బడుల విలీనం కారణంగానే విద్యకు దూరమయ్యారనే చర్చ సాగుతోంది.



ఐరాల మండలం భీమినేనివారిపల్లెలో..



కార్వేటినగరం మండలంలో కలికిరి ఇండ్లులో మూతబడిన పాఠశాల



దీన్నేమంటారు జగన్ మామా..!

● విలీనంతో ప్రభుత్వ బడులకు పేద విద్యార్థులు దూరం

● ప్రైవేటుకు కొందరు.. చదువుకోలేక మరికొందరు

అంటరానితనం తన రూపం మార్చుకుంది. పేదలను దూరంగా ఉంచడం మాత్రమే అంటరానితనం కాదు. పేదవారు ఇంగ్లిషు మీడియం చదవొద్దని కోరుకోవడం కూడా అంటరానితనమే.

- విజయవాడలో జనవరి 19న అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలివీ.

ప్రభుత్వం తీసుకున్న పాఠశాలల విలీనం నిర్ణయంతో జిల్లాలో 16,634 మంది పేద విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమయ్యారు. వీరిలో కొందరు ప్రైవేటు స్కూళ్లలో చేరితే.. మిగిలిన వారు చదువు మానేశారు. ఇలా చదువుకు దూరం చేయడాన్ని ఏమంటారు జగన్ మామా.. అంటూ ప్రశ్నిస్తున్నారు ఆ నిరుపేద విద్యార్థులు. ఇదీ రూపుమార్చుకున్న అంటరానితనం కాదా అని నిలదీస్తున్నారు.

- చిత్తూరు (సెంట్రల్)

జగన్ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ విద్య గాడి తప్పింది. నాడు- నేడుతో బడుల రూపు మార్చామని చెప్పినా.. స్కూళ్ల విలీనంతో పేద విద్యార్థులకు చదువును దూరం చేశారు. ఉమ్మడి జిల్లాలో 2021లో బడుల విలీన ప్రక్రియ మొదలుపెట్టి 2023 విద్యా సంవత్సరానికి ముగించారు. 2021 ఆగస్టు 10లోపు 20 బడులను విలీనం చేశారు. 2021-22లో 4832 ప్రభుత్వ పాఠశాలల్లో 3,75,061 మంది విద్యార్థులు ఉన్నారు. 2022 ఫిబ్రవరిలో తొలి విడతగా 316 ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 చదువుతున్న 18207 మంది విద్యార్థులను మూడు కిలోమీటర్ల సమీపంలోని 312 ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ఒకటి, రెండు తరగతులున్న పాఠశాలను అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చేశారు. 2022-23లో 2297 ప్రాథమిక పాఠశాలల్లోని 1.20 లక్షల మంది విద్యార్థులను 572 ఉన్నత పాఠశాలల్లోకి సర్దుబాటు చేశారు. మొత్తంగా విలీనం ప్రక్రియ లెక్కల సవరణలు అనంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 421 పాఠశాలలు విలీనం చేశారు. వీటిలో 225 చిత్తూరు జిల్లాకు సంబంధించినవి.

టీచర్ల కొరతను సర్దుబాటు చేసేశారు

విద్యా సంవత్సరం	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థులు	టీచర్లు
2019-20	4904	3,43,683	17,230
2020-21	4853	3,66,586	17,233
2021-22	4832	3,75,061	17,454
జిల్లా విభజన తర్వాత			
2022-23	2468	1,69,191	8,466
2023-24	2455	1,52,557	8,680

జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చాక ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించలేదు. ఉన్న టీచర్లు పదవీ విరమణ చెందడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. దీన్ని పూడ్చేందుకు 2021లో 2008 డీఎస్సీలోని 214 మంది క్వాలిఫైడ్ అభ్యర్థులను మినిమం టైం స్కేల్ కింద విధుల్లోకి తీసుకుంది. ఆ తర్వాత ఇదే డీఎస్సీలోని మరో 54 మందిని 2023లో రిక్రూట్ చేసుకుంది. అప్పటికీ టీచర్ల కొరత తీరకపోవడంతో 2023లో 1998 డీఎస్సీలోని 614 మంది క్వాలిఫైడ్ అభ్యర్థులను ఎంటీఎస్ కింద విధుల్లోకి తీసుకుంది. ఇలా మొత్తంగా 882 మంది టీచర్లను ఎంటీఎస్ కింద నియామకం చేపట్టారు. బడుల విలీనంతో టీచర్ల సర్దుబాటు చేశారు. ఇలా ఐదేళ్లుగా విద్యా వ్యవస్థను పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ బడుల్లో చదివేందుకు విద్యార్థులు ఆసక్తి చూపకపోవడంతోనూ కొన్ని పాఠశాలలు మూతపడ్డాయి.



చిన్నబొమ్మయ్యపల్లెలో మూతపడిన బడి

విద్యార్థులు బడికి రాక..!

వెదురుకుప్పం మండలంలో విద్యార్థులు రాకపోవడంతో చిన్నబొమ్మయ్యపల్లె, గంటావారిపల్లె, సద్దికూళ్లపల్లె, తోటానంపల్లి, వావిలిచేను ప్రాథమిక పాఠశాలలను మూసివేశారు. ఆయా పాఠశాలల పరిధిలో బడి ఈడు పిల్లలున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాల నుంచి విద్యాసామగ్రి, మధ్యాహ్న భోజన వసతి తదితరాలు కల్పిస్తున్నా.. లోపం ఎక్కడుందో గానీ వీరంతా ఇక్కడ చదివేందుకు ఇష్టపడలేదు. దీనికి కారణం విద్యావ్యవస్థ గాడి తప్పడం అన్న ప్రచారం ఉంది. ఈ క్రమంలో వీరంతా ప్రైవేటు పాఠశాలల్లో చేరడంతో మూతపడ్డాయి. వాస్తవానికి ఆయా పాఠశాలల పరిధిలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాల్సిన క్షేత్రస్థాయి ఉద్యోగులు కూడా మొక్కుబడిగా చేతులు దులుపుకొన్నారని ఆయా గ్రామస్తులు అంటున్నారు.

- వెదురుకుప్పం

మూత దిశగా ఆరు పాఠశాలలు

గుడిపాల మండలంలోని డీబీపల్లి (దక్షిణబ్రాహ్మణపల్లె), తుమ్మలవారిపల్లె, చలిచీమలపల్లె, పాపిశెట్టిపల్లె (తెలుగు, తమిళ్), తిమ్మయ్యపల్లె, నారగల్లు పాఠశాలలు మూతపడే దశలో ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో ఇద్దరు చొప్పున విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒక్కో టీచరు వంతున విధులు నిర్వహిస్తున్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఈ పాఠశాలలు మూతబడే అవకాశముంది.

- గుడిపాల

ఇద్దరికే పరిమితమైన దక్షణ బ్రాహ్మణపల్లె పాఠశాల



కొక్కువారిపల్లెలో మూత'బడి'

● ఆ దిశగా మరో ఏడు ప్రాథమిక పాఠశాలలు



పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ కొక్కువారిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మూతపడింది. గతేడాది పాఠశాల పునఃప్రారంభంలోనే విద్యార్థులు లేరిక్కడ. కొవిడ్ అనంతరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 3280 మంది విద్యార్థులు చదువుతుండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 2788కి పడిపోయింది. ఇక, కూనపల్లెలో నలుగురు, వీసీ వడ్డిపల్లెలో 8, రాజులపల్లె 10, వీకే పల్లె 10, బండారువారిపల్లెలో నలుగురు, చెన్నుపాటివారిపల్లెలో 7, దిన్నెపాటివారిపల్లె 7 మంది చొప్పున విద్యార్థులున్నారు. దీంతో ఈ ఏడు పాఠశాలల భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారనుంది.

- కల్లూరు

చిత్తూరు పార్లమెంటు వర్తమానం

కంచుకోటలో దూసుకెళ్తున్న టీడీపీ

● అటు స్వతంత్రంగా.. ఇటు ఎమ్మెల్యే అభ్యర్థులతో సమ్వనయంగా ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రచారం

● ఈ ఐదేళ్లూ డమ్మీ ఎంపీగా పేరుగాంచిన వైసీపీ అభ్యర్థి రెడ్డెప్ప

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత చిత్తూరు లోక్‌సభకు పదిసార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఏడుసార్లు టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. అలాంటి కంచుకోటలో ఈసారి జెండా ఎగరేయాలని టీడీపీ కృతనిశ్చయంతో ఉంది. మరోవైపు ఈ ఐదేళ్లూ రెడ్డెప్ప డమ్మీ ఎంపీగా మిగిలిపోయారు. తాను మాత్రం డమ్మీగా ఉండబోనని.. సమస్యల పరిష్కారానికి పార్లమెంటులో పోరాడతానంటూ టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు చెబుతున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

తెలుగుదేశం పార్టీ తరపున చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు మాజీ ఐఆర్ఎస్ అధికారి. ఈయన పలు రాష్ట్రాల్లో ఇన్‌కమ్‌ట్యాక్స్ జాయింట్ కమిషనరుగా పనిచేసి ముందస్తు పదవీ విరమణ పొందారు. హైదరాబాదు కేంద్రంగా పనిచేస్తున్న రాధే కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఈయన్ను టీడీపీ అధినేత చంద్రబాబు చిత్తూరుకు పంపించారు. ఈయన అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచీ తనదైన శైలిలో ఎమ్మెల్యే అభ్యర్థులను కలుపుకొని ముందుకు వెళ్తున్నారు. కుప్పం నుంచి చంద్రగిరి వరకు రోజుకో నియోజకవర్గంలో పర్యటిస్తూ ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి ప్రచారం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో నివాసం, కార్యాలయాన్ని ప్రారంభించి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. తక్కువ కాలంలోనే సౌమ్యుడిగా పేరు సంపాదించుకున్నారు.



టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు

అటు సమన్వయంతో..

కుప్పం నియోజకవర్గంలో ఈసారి చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజార్టీ లక్ష్యంతో శ్రేణులు పనిచేస్తున్నాయి. ఇక్కడ వచ్చే మెజారిటీనే ఎంపీ అభ్యర్థి విజయానికి కలిసొచ్చే అంశం. కుప్పం, పలమనేరు, పుత్తూరు ప్రాంతాల్లో జరిగిన సభల్లో ఈయన్ను టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలకు పరిచయం చేశారు. పలమనేరులో అమరనాథరెడ్డి, చిత్తూరులో గురజాల జగన్మోహన్, పూతలపట్టులో మురళీమోహన్, జీడీనెల్లూరులో థామస్, నగరిలో గాలి భానుప్రకాష్, చంద్రగిరిలో పులివర్తి నానిని సమన్వయం చేసుకుంటూ ప్రచారం సాగిస్తున్నారు. చిత్తూరు పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులందరి నామినేషన్ల కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. ఇలా ఎమ్మెల్యే అభ్యర్థులను సమన్వయం చేసుకుంటూనే మరోవైపు తన టీమ్‌తో ఆయా నియోజకవర్గాల్లో ప్రచారం సాగిస్తున్నారు. ఆయన కుమారుడు రాధే, ఇతర కుటుంబ సభ్యులూ విస్తృతంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం చిత్తూరు పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో టీడీపీకి అనుకూల పరిస్థితులు నెలకొన్నాయి.



పెద్దిరెడ్డి కాళ్లు మొక్కుతున్న రెడ్డెప్ప

రెడ్డెప్పపై దళిత సంఘాల్లో ఆగ్రహం

ఇక, తాజా ఎంపీ, వైసీపీ అభ్యర్థి రెడ్డెప్ప.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుచరుడు. ఆయన చెప్పింది ఈయనకు వేదం. ఈ ఐదేళ్లూ డమ్మీగానే ఉన్నారు. ఇటీవల మదనపల్లెలో బీఫాం తీసుకుని ఆయన మంత్రి పెద్దిరెడ్డి కాళ్లు మొక్కడంపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. దళితుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారంటూ ఆ సంఘాల నేతలు మండిపడుతున్నారు. 2019 ఎన్నికల్లోనూ పెద్దిరెడ్డి ఈయనకు టికెట్ ఇప్పించారు. అప్పటి గాలిలో టీడీపీ అభ్యర్థి శివప్రసాద్ మీద రెడ్డెప్ప గెలిచారు. పుంగనూరుకు చెందిన ఈయన.. అసలు చిత్తూరుకు ఎంపీ ఉన్నారనే విషయమే ప్రజలకు గుర్తు లేనంతగా ఆయన వ్యవహరించారు. అంతలా డమ్మీ ఎంపీగా ఉన్న ఆయన్ను ఈసారి తొలుత జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా మార్చి, మళ్లీ చిత్తూరు అభ్యర్థిగా వైసీపీ అధిష్ఠానం ప్రకటించింది. టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల తరహాలో స్వతంత్రత కలిగిన వ్యక్తిగా కాకుండా, రెడ్డెప్ప పూర్తిగా మంత్రి పెద్దిరెడ్డిపైనే ఆధారపడి ముందుకు సాగుతున్నారు.

తన కుమారుడిని ప్రాణాపాయం నుంచి శత్రువు కాపాడాడని తెలిసి రగిలిపోతాడు. అలాంటి ప్రాణం వద్దని కొడుకునే చంపేస్తాడు.

- ఇదీ 'ఇంద్ర' సినిమాలో ఓ సన్నివేశం.



కుప్పంలో అన్న క్యాంటీన్ నిర్వాహకులతో గొడవ పడుతున్న వైసీపీ శ్రేణులు

ఆకలి పార్టీ ఎరుగదు

వైసీపీ శ్రేణుల కడుపునింపిన అన్నా క్యాంటీన్

మావాళ్ల కడుపు నింపితే ఖబడ్దార్ అంటూ అధికార పార్టీ నేతల గొడవ

అన్న క్యాంటీన్ నిర్వాకులతో గొడవపడ్డ వైసీపీ శ్రేణులు

ఇప్పుడు కుప్పానికి వస్తే..

బుధవారం వైసీపీ అభ్యర్థి భరత్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న శ్రేణులకు సమయానికి బిర్యానీ ప్యాకెట్లు అందలేదు. ఆకలి పార్టీ ఎరుగదు అన్నట్లు.. వీరంతా టీడీపీ శ్రేణులు అన్నా క్యాంటీన్‌లోకి తమ జెండాలతో దూరారు. 'మావాళ్ల కడుపు నింపితే ఖబడ్దార్' అంటూ అధికార పార్టీకి చెందిన ఇంకొంతమంది కార్యకర్తలు క్యాంటీన్ నిర్వాహకులతో గొడవకు దిగారు.

ఇంతకీ ఏం జరిగిందంటే..

వైసీపీ అభ్యర్థి భరత్ నామినేషన్ సందర్భంగా బుధవారం ఆ పార్టీ కుప్పంలో ర్యాలీ నిర్వహించింది. జన సమీకరణకోసం డబ్బు, మద్యం, బిరియానీ.. అంటూ ఏవో ఏర్పాట్లు చేసింది కానీ, కార్యకర్తలకు అవి అందేసరికి చాలా ఆలస్యమే అయింది. ముఖ్యంగా దూర ప్రాంతాలనుంచి ఎప్పుడో వచ్చిన సామాన్య కార్యకర్తలకు మధ్యాహ్నం పన్నెండు గంటలయ్యేసరికి ఆకలి మొదలైంది. అప్పటికి ర్యాలీ పట్టణంలో కొనసాగుతోంది. అదే సమయంలో ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట టీడీపీ ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నదానం జరుగుతోంది. దీంతో కొంతమంది కార్యకర్తలు తామున్న పార్టీ కానీ, ఉన్నది ఆ పార్టీ ర్యాలీలో అని కానీ మరచిపోయారు. చేతిలో ఉన్న వైసీపీ జెండాలను అలాగే పట్టుకుని అన్నా క్యాంటీన్ దగ్గరకు చేరుకున్నారు. తట్టలను పట్టుకుని గుంపులుగా అన్నంకోసం ఎగబడ్డారు. పాపం.. ఆకలిమీదున్నారు. పార్టీ ఏదైతే ఏమిటి.. అనుకున్న టీడీపీ శ్రేణులు వారికి కడుపారా అన్నం పెట్టి ఆకలి తీర్చాయి. తమ పార్టీ కార్యకర్తలు అన్నా క్యాంటీన్‌లో కడుపు నింపుకోవడం చూసిన ర్యాలీలోని కొందరు నాయకులు, ఇతర కార్యకర్తలను ఉసిగొలిపారు. వాళ్లంతా అన్న క్యాంటీన్ నిర్వాహకులైన టీడీపీ శ్రేణులపై విరుకుపడ్డారు. 'మావాళ్ల ఆకలి తీరుస్తారా? మీ అంతు చూస్తా మం'టూ గొడవకు దిగారు. 'ఇదేం చోద్యం? ఆకలికి పార్టీలు ఉంటాయా? ఆకలి అని వచ్చినవారికి ఇంత అన్నం పెట్టి కడుపు నింపడం కూడా తప్పేనా?' అంటూ ఆ పరిసరాల్లోని జనం నోళ్లు నొక్కుకున్నారు. చివరకు భోజనం చేస్తున్న వైసీపీ కార్యకర్తలే తిరగబడడంతో గొడవకు దిగిన ఇతర కార్యకర్తలు సైలెంటైపోయారు. ఆ తర్వాత ఇంకెవరూ అన్నా క్యాంటీన్‌వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

- కుప్పం

పదిలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నగదు బహుమతులు



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్న ఎస్టీయూ నేత ఆర్వీ రమణ

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 24: ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఎస్టీయూ రాష్ట్రనాయకులు ఆర్వీ రమణ తోపాటు ఆ స్కూల్ ఉపాధ్యాయులు నగదు బహుమతులు అందించారు. బుధవారం స్థానిక జడ్పీస్కూల్‌లో వారిని అభినందించారు. ఇందులో ఆర్వీ రమణ రూ. 10 వేలు, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలు విజయలక్ష్మీరూ. 5వేలు, ఆంగ్ల ఉపాధ్యాయులురాళ్లు పద్మావతి రూ. 5వేలు, జుబేదాబేగం రూ. 8వేలు విదార్థులకు అందజేశారు. ఈ స్కూల్‌లో 500మార్కులుపైగా 54మంది సాధించినందులకు హెచ్ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఎంసెట్ మోడల్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ



మోడల్ ఎంసెట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 24: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఎంసెట్ మోడల్ ఆన్‌లైన్ టెస్టులో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. వారికి విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు వినయ్ బహుమతులు అందించారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ్, నాయకులు మురళి, ఓ ప్రైవేటు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు తమ విద్యను పెంపొందించుకోవడానికి మోడల్ ఎంసెట్ పరీక్షలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు భవిత, గంగరాణి, కమలాకర్, శ్రీనాథ్, పవన్, జస్వంత్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం కేసులో వ్యక్తి అరెస్టు



మద్యం బాటిళ్లు నిందితుడితో పోలీసులు

కలకడ, ఏప్రిల్ 24:అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కేసులో సయ్యద్ బాషా అనే వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. కలకడకు చెందిన సయ్యద్‌బాషా కిరాణ దుకాణం నడుపుతూ మద్యం విక్రయిస్తుండగా 50 బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. నిందితున్ని రిమాండుకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

బోయకొండ గంగమ్మ విగ్రహప్రతిష్ఠ

మదనపల్లె అర్బన్, ఏప్రిల్24: మండలంలోని వేంపల్లె పంచాయతీలో నల్లగుట్టపల్లెలో 25న బోయకొండ గంగమ్మ విగ్రహప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు నల్లగుట్టపల్లె గ్రామస్థులు తెలిపారు. ఇందులో భాగంగా ఆలయంలో కలశారాధన పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులుసి. నారాయణ, రామకృష్ణ, నరేష్, వెంకటేష్‌ల తోపాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

పేర్లు అమోఘం.. సౌకర్యాలు శూన్యం

● మేజర్ పంచాయతీ అయిన వాయల్పాడు.. వాల్మీకిపురం పేర్లు ఘనం ● కనీస పార్కుకు నోచుకోని వైనం



సౌకర్యాల్లేని వాల్మీకిపురం గాంధీ బస్టాండు ప్రాంతం



వాల్మీకిపురం గ్రామ పంచాయతీ కార్యాలయం



పంచాయతీ పార్కులో ఏర్పాటైన కట్టడాలు

వాల్మీకిపురం, ఏప్రిల్ 24: వాయల్పాడు..వాల్మీకిపురం.. ఇలా ఊరికి రెండు పేర్లు..పేర్లలో ఉన్న గొప్పతనం అభివృద్ధిలో లేదు. బ్రిటీష్ కాలం నాటి నుంచి ఎంతో ప్రాశస్తి ఉన్న ఈ పట్టణం .ఒకప్పటి నియోజకవర్గం కేంద్రం, తరువాత చోటుచేసుకున్న పరిణామాలు, పాలకుల స్వార్థాలూ ఇప్పటికీ ఆ ఊరి బాగోగులను పట్టించుకున్న నాదుడే లేదు.వాల్మీకిపురం పట్టణంలో ప్రస్తుతం సుమారుగా 30వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. అయితే అందుకు తగ్గట్టు ఒక పార్కు, తదితర సౌకర్యాల కల్పన లేకపోవడం శోచనీయం. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఒకప్పుడు ఉండే పార్కు ప్రాంతం పూర్తిగా కనుమరుగైంది. సాధారణంగా గ్రామపంచాయతీలో అన్నీ పన్నులు వసూలు చేసే అధికార ఘనం వసతుల కల్పనలో అదే చొరవ చూపడంలేదన ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా రు. ఒకప్పటి బాపూజీ పార్కును సైతం కనుమరుగు చేశారు. దీంతో పట్టణంలో ఉదయం, సాయంత్రం కాలి నడకతో సేద తీరే పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎప్పటికప్పుడు పన్నులతో ప్రజలను హెచ్చరించే పంచా యతీ అధికారులకు సమస్యలు కనపడటం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వాకింగ్ చేయాలంటే.. రైల్వే స్టేషన్‌కు వెళ్లాల్సిందే..!

ప్రతి నిత్యం వాల్మీకిపురంలో విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్‌లు, మహిళలు ఉదయం, సాయంత్రం నడక సాగించాలంటే ఎక్కడా ఆసరా లేక అందరూ స్థానిక రైల్వే స్టేషన్ చేరుకుని తమ నడక సాగించడం నిత్యకృత్యంగా మారింది. పట్టణంలో ఒకప్పటి గ్రామ పంచాయతీ పార్కు ప్రాంతం సచివాలయం, అనవసరపు కట్టడాలతో ఆక్రమణలకు గురికావడం ప్రజలు సైతం ప్రశ్నించే సందర్భం లేకుండాపోతోంది. బ్రిటీష్ కాలం నాటి నుంచి ఎంతో సౌకర్యంగా ఉండే గాంధీ బస్టాండు ప్రాంతం నిలువ నీడ లేదు. ప్రయాణికుల సౌకర్యార్థం మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్టాండు ప్రాంతంలో గ్రామ చావిడి స్థలాలు ఉన్నా అధికారులకు సమస్యను విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని సర్వత్రా విమర్శలున్నాయి.

పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం

వాల్మీకిపురం పట్టణంలో గతంలో పార్కు ఉన్న ప్రాంతంలో ప్రభుత్వ భవన నిర్మాణాలు జరిగాయి. పట్టణ ప్రజలకు అనుకూలంగా, ఆహ్లాదంగా ఉండేలా నూతన పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ఇందు కోసం స్థల పరిశీలన చేసి గతంలో కంటే మెరుగైన సౌకర్యాలతో పార్కు ఏర్పాటకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతాం. కాగా గతంలో పార్కు ఉన్న స్థలంలో ప్రజల సౌకర్యార్థం నీటి ట్యాంకు నిర్మాణాలు ఉన్నాయి. దీంతో అక్కడ పార్కు ఏర్పాటుకు స్థలం అనుకూలంగా లేదు.

-రెడ్డిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, వాల్మీకిపురం

ఊరికి గుర్తింపు లేదు..



వాల్మీకిపురం పేరు చెబితే ఒకప్పుడు ఎంతో గుర్తింపు. ప్రస్తుతం అది ఎక్క డా కనిపించడం లేదు. ఊరికి ఉన్న ఒకానొక్క పార్కు కూడా కనుమ రుగైంది. ప్రతి ఊరికి ఓ పార్కు లాంటి ప్రశాంత వాతావరణం ఉంటుంది. అది మా ఊరికి లేదనే బాధ జీర్ణించుకోలేం. అధికారులు, పాలకులు స్పందించాలి.

-ప్రభుచరణ్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు, వాల్మీకిపురం

కనీస సౌకర్యాలను కల్పించాలి



వాల్మీకిపురానికి మా తాతల నాటి నుంచి ఎంతో గుర్తింపు ఉంది. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. గాంధీ బస్టాండు ప్రాంతంలో ఈన్నీ సమస్యలే. ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేవు. బస్టాండు ప్రాంతంలో కనీసం మరుగు దొడ్లు లేక నిత్యం ఇబ్బందులే. ప్రభుత్వ స్థలాలు ఉన్నా అధికారులు గుర్తించి కనీస సౌకర్యాలను కల్పించాలి.

-రఘు, వ్యాపారి, వాల్మీకిపురం

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

● ఎస్వీ యూనివర్సిటీ వీసీ శ్రీకాంత్‌రెడ్డి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ



విద్యార్థునుల సాంస్కృతిక కార్యక్రమాలు

కురబలకోట, ఏప్రిల్ 24: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఎస్వీయూనివర్సిటీ వీసీ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంగళ్లు సమీపంలోని విశ్వం డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన అతిసర్గ 2కె24 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానిని చేరుకోవడానికి నింతరం కష్టపడి ముందుకు సాగాలన్నారు. దీని కోసం నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. విద్యార్థులు ఎంతటి స్థాయికి ఎదిగినా తమ తల్లిదండ్రులను, గురువులను, సొంత ఊరిని మర్చిపోకూడదన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్ర మంలో చైర్మన్ ఎం.ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే రాష్ట్రాభివృద్ధి



నిమ్మనపల్లెలో ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 24: ఉమ్మడి అభ్యర్థులను గెలిపిస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్వే వెంకటేష్, మాజీ మండల అధ్యక్షుడు రాజన్నలు పేర్కొన్నారు. బుధవారం ముష్టూరు పంచాయతిలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషాను, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికి తిరిగి కరపత్రాలను పంచుతూ టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల కొరకు టీడీపీ 50ఏళ్లకే పింఛన్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. అలాగే వైసీపీ పార్టీ తమ గ్రామంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదని ఆ పార్టీకి చెందిన వైసీపీ సింగిల్ విండో డైరెక్టర్ ఆదెన్న, మన్సూర్ బేగ్, ఆకుల వెంకటరమణ, అంజాద్‌అలీ, మస్తాన్‌వలీ, సాబ్‌జాన్‌సాబ్‌లు రాజన్న, ఆర్వే వెంకటేష్ ఆధ్వర్యంలో టీడీపీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. అనం తరం వారు మాట్లాడుతూ వైసీపీ 5ఏళ్ల అధికారంలో వున్నా తమను ఏనాడు పట్టిం చుకోలేదని తెలిపారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా షాజహాన్‌బాషాకు సైకిల్ గుర్తుకు, ఎంపీగా కిరణ్ కుమార్ రెడ్డికి కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించి చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమణ, రామకృష్ణ, రెడ్డెప్ప, చంద్రసింగ్, మెకానిక్ బాషా, మోహన, తేజ, నరసింహులు, శ్రీపతి, మహమ్మద్‌రఫి, శ్రీరాములు, సుధాకర్, జగదీష్, రెడ్డెప్ప జయన్న పాల్గొన్నారు.

నేడు మిట్స్‌లో అశ్వ 2కే24

కురబలకోట, ఏప్రిల్ 24: మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 25, 26 తేదీల్లో జాతీయస్థాయిలో టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ అశ్వ-2కె24ను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఈ కార్యక్రమానికి 25న ముఖ్య అతిథిగా సినీ నటుడు నిఖిల్, మిమిక్రి ఆర్టిస్టు ఆర్.జె.సూర్యలు 26న ప్రముఖ గాయకుడు అర్జున్ విజయ్, సిందూజా శ్రీనివాసన్, ఎం.పర్ణికలు, పోటెల్, సీతారామ్ చిత్రాల టీంలు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మదనపల్లెలో కాంగ్రెస్ పార్టీ ముమ్మర ప్రచారం



మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 24: పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గ నాయకుడు ఎస్‌రెడ్డిసాహెబ్‌తో కలిసి బుధవారం ప్రచారం ముమ్మరం చేశారు. పట్టణంలో ప్రచారంలో భాగంగా కూరగాయల వ్యాపారితో కలిసి తమకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ నాయకులు పట్టణ సమీపంలోని చివరి ప్రాంతాల్లోని కాలనీలో ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేసే పథకాలను గురించి ప్రజలకు వివరించారు. ప్రజా సంక్షేమం కాంక్షించే కాంగ్రెస్ పార్టీ ని ఓటర్లు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బమదనపల్లె నియోజక వర్గ నాయకుడు ఎస్‌రెడ్డిసాహెబ్, మహ మద్‌రఫీ, మహబూబ్‌పీర్, పాలేటీ, మహమ్మద్‌అలీ, నరేంద్ర, బాబ్జీ ప్రచారంలో పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో పది నామినేషన్లు దాఖలు



ఆర్వోకు నామినేషన్ పత్రాలను అందచేస్తున్న మద్దిరెడ్డి కొండ్రెడ్డి



ఆర్వోకు నామినేషన్ పత్రాలను అందచేస్తున్న కల్పనారెడ్డి

తంబళ్లపల్లె, ఏప్రిల్ 24: తంబళ్లపల్లె శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి బుధవారం పది నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థులుగా మంత్రి కల్పనారెడ్డి నామినేషన్ వేయగా, దాసరిపల్లె జయచంద్రారెడ్డి నామినేషన్‌ను ప్రతిపాదకుడు శివశంకర్‌రెడ్డి ఆర్వో రాఘవేంద్రకు సమర్పించారు. అదేవిధంగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందచేశారు. వైసీపీ అభ్యర్థులుగా పెద్దిరెడ్డిగారి కవిత రెండు సెట్లు నామినేషన్ వేయగా, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, పెద్దిరెడ్డి వెంకట అభినయ్‌రెడ్డిలు ఒక్కో సెట్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంఎన్‌చంద్రశేఖర్‌రెడ్డి, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా పీతల అంజలి, స్వతంత్ర అభ్యర్థిగా గుండాల క్రిష్ణప్ప నామినేషన్ దాఖలు చేశారు.

ఆరో రోజున ఐదు నామినేషన్లు దాఖలు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 24: మదనపల్లె నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియలో ఆరో రోజున ఐదు నామినేషన్లు దాఖలు అయ్యాయి. బుధవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ ఆధ్వర్యంలో నామినేషన్లు స్వీకరించారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లెల పవన్‌కుమార్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి ఎ.కృష్ణప్ప, బీఎస్పీ అభ్యర్థిగా జయసింహ, ఇండిపెండెంట్ అభ్యర్థిగా జనార్ధన, వైసీపీ అభ్యర్థి నిస్సార్ అహ్మద్ నామినేషన్లు దాఖలు చేశారు. ఆర్వో కార్యాలయంలోకి వైసీపీ అభ్యర్థి వెంట ఐదుగురికి మించి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసు అధికారులు అడ్డుకున్నారు. దీంతో కేవలం ఐదుగురు మాత్రమే వెళ్లారు.

పీలేరు అసెంబ్లీకి ఐదు నామినేషన్లు దాఖలు

పీలేరు, ఏప్రిల్ 24: పీలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే వీటిలో మూడు సెట్లను టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి తరపున ఆయన అనుచరులు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బాలిరెడ్డి సోమశేఖర రెడ్డి మరో దఫా నామినేషన్ వేశారు. జై మహాభారత్ పార్టీ తరపున ఎం.విజయ్ కుమార్ తన నామినేషన్ దాఖలు చేశారు.

ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటు వేయవచ్చు



మదనపల్లె జడ్పీ హైస్కూల్లో స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రతను పరిశీలిస్తున్న అబ్జర్వర్ నవాజ్ అహ్మద్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 24: ఓటు హక్కు వున్న ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటు వేయవచ్చని జిల్లాకు వచ్చిన ఎన్నికల పరిశీలకుడు దిల్ నవాజ్ అహ్మద్ పేర్కొన్నారు. బుధవారం మదనపల్లె జడ్పీ హైస్కూల్, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని మిట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను అబ్జర్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ కూడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ఠ బందోబస్తు నిర్వహించాలని పోలీసులకు సూచించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టు టౌన్ సీఐ యువరాజు, ఎస్ఎస్‌బీ ఫోర్సు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం, నాటు సారా విక్రయాలను అడ్డుకోండి

● ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్



ఎస్ఈబీ సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఈబీ డీసీ విజయశేఖర్

ములకలచెరువు, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా కర్ణాటక అక్రమ మద్యం, నాటు సారా విక్రయాలను అడ్డుకోవడానికి దాడులు ముమ్మరం చేయాలని అనంతపు రం జోన్ ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ విజ యశేఖర్ ఆదేశించారు. ములకలచెరువు ఎస్ఈబీ స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేసి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పాత నేరస్థులను బైండోవర్ చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి నమోదైన కేసుల వివరాలపై ఆరా తీశారు. ఈ తనిఖీల్లో ఎస్ఈబీ సీఐ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాలు వందశాతం లక్ష్యాలు సాధించాలి

● డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 24: పట్టణ ఆరోగ్య కేంద్రాలు వందశాతం లక్ష్యాలను సాధించాలని అన్నమయ్య జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్య వేక్షణ అధికారి (డీపీఎంవో) డాక్టర్ రియాజ్‌బేగ్ అన్నారు. బుధవారం ఆయన రాయచోటి మున్సి పాలిటీ పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రం వాల్మీకి స్ట్రీట్‌లో వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న సెక్టార్ మీటింగ్‌ను ఏపీ డెమోలజిస్ట్ వెంకటేష్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూపీహెచ్‌సీలలో వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రతిరోజు టెలిమెడిసిన్ సేవలు అందించాలని, అర్బన్‌లో వ్యాధి నిరోధక టీకాల ప్రగతి చాలా తక్కువగా ఉందని, ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసుకుని లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. ఓఆర్ఎస్ కార్నర్ ఏర్పాటు చేసుకుని అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఫార్మసిస్టును ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని, వివరాలను యాప్‌లో ఏఎన్ఎం అప్డేట్ చేయాలని తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఎండలు పెరుగుతున్న దరిమిలా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగకుండా ఉండడం, గొడుగులు, టోపీలు, చలవ అద్దాలు వాడటం వంటి జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో సంక్షేమం, అభివృద్ధి



ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్దప్ప, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 24: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోడెం సిద్ధప్ప పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 33 వార్డులో సిద్దప్ప ఆధ్వర్యంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, చేనేత సంఘం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే మదనపల్లెలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తారన్నారు. నిరుద్యోగులకు మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగావకాశాలు కల్పిస్తారని, బీసీలకు రక్షణ చట్టం తీసుకొస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు నీలకంఠ, రామిశెట్టి అంజినేయులు, బండి నాగరాజ, ఆర్.రత్నమయ్య, కృష్ణ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

నేడు కలిచెర్ల పోలేరమ్మ తిరుణాల

పెద్దమండ్యం, ఏప్రిల్ 24: పెద్దమండ్యం మండలం కలిచెర్ల ఇప్పవనంలో వెలసిన పోలేరమ్మ ఆలయంలో అమ్మవారి తిరుణాల ఈ నెల 25న రాత్రి జరుగున్నట్లు నిర్వాహకులు సింగిల్‌విండో చైర్మన్ కడప సుధాకరరెడ్డి, కడప మధుకరరెడ్డి వెల్లడించారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం దీలు, బోణాలు కార్యక్రమం జరుగనున్నట్లు తెలిపారు. అలాగే రాత్రిలో మహాభారతం నాటకం, పగలు హరికథ కాలక్షేప కార్యక్రమాలు పది రోజులు పాటు జరుగుతాయని తెలిపారు.

బీసీలకు తెలుగుదేశం పార్టీ పుట్టినిల్లు

● టీడీపీ హయాంలోనే బీసీలకు గుర్తింపు
● పీలేరులో నల్లారి తనూజా రెడ్డి



పీలేరు ఆర్టీసీ నల్లగుట్టలో ప్రచారం చేస్తున్న నల్లారి తనూజా రెడ్డి

పీలేరు, ఏప్రిల్ 24: రాజకీయ రంగంలో తెలుగుదేశం పార్టీ బీసీలకు పుట్టినిల్లు అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డి పేర్కొన్నారు. పీలేరు పట్టణంలోని ఆర్టీసీ నల్లగుట్ట, చిత్తూరు రోడ్డు మార్గాల్లో బుధవారం ఆమె టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావానికి ముందు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు రాజకీయ అధికారానికి దూరంగా ఉండేవారన్నారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాసెస్ కాదని, సమాజానికి బ్యాక్ బోన్ క్లాసెస్ అని నినదించిన స్వర్గీయ ఎన్టీఆర్ అందుకు అనుగుణంగా రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తిని కొనసాగించిన చంద్రబాబు నాయుడు రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి అనేక మంది బీసీలను తిరుగులేని రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దారన్నారు. అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉపాధి రంగాల్లో అభివృద్ధికి బాటలు వేశారన్నారు. స్థానిక సంస్థల దగ్గర నుంచి రాష్ట్రస్థాయి పదవుల వరకు నల్లారి కుటుంబం కూడా ఎంతో బీసీలను ప్రోత్సహించిందన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలోని బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడిపోయారన్నారు. కార్పొరేషన్లు ఫుల్, నిధులు నిల్ కావడంతో గడిచిన నాలుగున్నరేళ్ల పాలనలో బీసీలకు ఎటువంటి మేలు జరగలేదన్నారు. రూ.75 వేల కోట్ల బీసీల సంక్షేమం, బీసీ సబ్-ప్లాన్ నిధులను దారి మళ్లించడమే కాకుండా బీసీల అభివృద్ధి కోసం తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన 30 పథకాలను రద్దు చేసిన బీసీల ద్రోహిగా ముఖ్యమంత్రి జగన్ మారారని ధ్వజమెత్తారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్న వైసీపీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా మార్చివేశారని, ఆ పార్టీలో ఇమడలేక చాలా మంది బీసీ నాయకులు టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో అనేక రకాలుగా ఇబ్బందులు పడిన బీసీలను శాశ్వత ప్రాతిపదికన రక్షణ కల్పించాలన్న లక్ష్యంతో చంద్రబాబు నాయుడు బీసీల కోసం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలో ప్రత్యేక రక్షణ చట్టం తెస్తున్నారన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో పెత్తందారీ మనస్తత్వం కలిగిన వైసీపీని ఓడించి సామాజిక న్యాయం పాటించే టీడీపీని గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలు పంచుతూ, వాటి గురించి ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఆర్టీసీ నల్లగుట్టకు చెందిన మాజీ ముతవల్లి హుస్సేన్ సాహెబ్ ఆమె సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి తనయ వైష్ణవిరెడ్డి, టీడీపీ నేతలు శ్రీకాంత్ రెడ్డి, దేవిరెడ్డి వెంకటరమణారెడ్డి, మల్లెల రెడ్డిబాషా, ఖాదర్‌బాషా, కువైట్ మస్తాన్, శ్రీనాథ్, పోలిశెట్టి సురేంద్ర, పురందరామ్మూర్తి, యల్లెల రెడ్డప్పరెడ్డి, షౌక త్‌అలీ, సాధన, రమాదేవి, సుభద్రమ్మ, ఆబిద్ అలీ, సర్దార్, నల్లారి రియాజ్, జాకీర్, ప్రతాపరెడ్డి, ఈశ్వర, షరీఫ్, చంద్రమ్మ, చందన, స్వర్ణ, మీనా, జనసేన నేతలు కలప రవి, గజేంద్ర, గురుమోహన్, ధనశేఖర, రాజేశ్, పాల్గొన్నారు.



టీడీపీకి మద్దతు తెలిపిన మాజీ ముతవల్లి హుస్సేన్ సాహెబ్